అధికారుల అలసత్వం..
రోగులకు ప్రాణ సంకటం
- ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి మరణాలు
- స్కానింగ్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులు
- విచారణలతోనే సరిపెడుతున్న అధికారులు

6

దశల వారీగా సౌర విద్యుత్ అభివృద్ధి



- జిల్లాలో ప్లాంట్లు ఏర్పాటుకు పక్కా కార్యాచరణ
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ రెడ్కో డీఎం అజయ్‌కుమార్

ఇంటర్వ్యూ...

ఖమ్మం, మే 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): దశల వారీగా ఖమ్మం జిల్లాలో సౌర విద్యుత్ అభివృద్ధికి చర్యలు చేపట్టామని, ఇందుకోసం పక్కాగా కార్యాచరణ రూపొందించి.. పనులు చేపట్టనున్నట్టు తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) డీఎం టి.అజయ్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో సౌర విద్యుత్‌ను దశల వారీగా అభివృద్ధి చేయడంతోపాటు ఉత్పత్తి ద్వారా ఆర్థికంగా ఆదాయం పొందే పథకాలను కూడా రూపొందించి అమలు చేస్తున్నామని ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ఆంధ్రజ్యోతి: టీజీ రెడ్కో ద్వారా అమలు చేస్తున్న పథకాలేంటి?

డీఎం: తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల సంస్థ ద్వారా అనేక పథకాలు ప్రవేశపెట్టి.. వాటి ద్వారా పలు పనులు చేపడుతున్నాం. పీఎం కుసుమ్ కాంపోనెంట్ ఏ పథకం కింద 500కిలోవాట్ల నుంచి 2మెగా వాట్ల సామర్థ్యంతో పవర్‌ప్లాంట్ స్థాపనకోసం పథకం అమలు చేస్తున్నాం. రైతులు వ్యక్తిగతంగా, ఓ సమూహంగా, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ పథకం కింద ప్లాంట్లు ఏర్పాటు చేయవచ్చు. 33/11కేవీ సబ్‌స్టేషన్లకు 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న వ్యవసాయ భూములపై ఈ పవర్‌ప్లాంట్లు 3 నుంచి 4ఎకరాల్లో 25 ఏళ్లపాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి జరిగేలా రూపొందించాం. ఖమ్మం జిల్లా పరిధిలో ఇప్పటికే 154 దరఖాస్తులు వచ్చాయి. 242 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, భద్రాద్రి జిల్లాలో 154దరఖాస్తులు, 121.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ప్లాంట్లు కావాలంటూ దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఈ పథకం కింద ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ఎవరు కొనుగోలు చేస్తారు?

డీఎం: పీఎం కుసుమ్ పథకం కింద తెలంగాణ గ్రిడ్ నుంచే విద్యుత్ కొనుగోలు చేస్తారు. ఒక యూనిట్‌కు రూ.3.13పైసల చొప్పున ఒప్పందం చేసుకుని చెల్లిస్తాం. 3 నుంచి 4ఎకరాల్లో నెలకొల్పే ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.3.50కోట్ల వరకు ఖర్చువుతుంది. 70 శాతం బ్యాంకులు రుణమిస్తాయి. 30 శాతం లబ్ధిదారుడు చెల్లించాలి.

ఆంధ్రజ్యోతి: పీఎం సూర్యఘర్ పథకం ఉమ్మడి జిల్లాలో అమలవుతోందా?

డీఎం: ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ఇళ్ల పైకప్పు ఇంటివద్దే సోలార్‌ప్లాంట్ పెట్టుకుని సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసేలా రూపొందించాం. ఈపథకం కోసం ఉమ్మడి జిల్లాలో ఒక మోడల్‌గ్రామాన్ని ఎంపిక చేశాం. ఖమ్మం జిల్లాలో 5వేలకంటే తక్కువజనాభా కలిగిన 11గ్రామాలను గుర్తించాం. కల్లూరు, తల్లాడ, ఏదులాపురం, ముదిగొండ, తనికెళ్ల, కందుకూరు, నేలకొండపల్లి, పెద్దతండా, కొణిజర్ల, (మిగతా 6వ పేజీలో)



తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి


కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న మీనాక్షి నటరాజన్

గిరిజన సంక్షేమమే ధ్యేయం

- వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేలా నల్లమల డిక్లరేషన్ ఇచ్చాం
- గత పదేళ్లలో నాటి పాలకులు సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేయలేదు
- మేం అధికారంలోకి వచ్చాక రూ.17,169కోట్లు కేటాయించాం
- అడవి బిడ్డల కోసం ఇందిరా సౌర గిరిజన వికాసం తీసుకొచ్చాం
- ఆదివాసీ కాంగ్రెస్ సమ్మేళనం ముగింపులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హాజరైన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి, పీసీసీ చీఫ్ మహేష్, మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, వారి హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేలా నల్లమల డిక్లరేషన్ కూడా ఇచ్చామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పాల్వంచ కిన్నెరసాని గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గత పదేళ్లలో రాష్ట్రాన్ని పరిపాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 17,169కోట్లను కేటాయించామన్నారు. ఆ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని, అలాగే గత ప్రభుత్వంలో ఖర్చు చేయని రూ.1296కోట్ల సబ్‌ప్లాన్ నిధులను కూడా కొనసాగించామన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఏ ఇంటికి ఏ పథకాలు (మిగతా 6వ పేజీలో)

మీనాక్షితో మంత్రి తుమ్మల భేటీ


మీనాక్షి నటరాజన్‌తో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగిన కాంగ్రెస్ గిరిజన కార్యకర్తల సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేటీపీఎస్ అతిథి గృహానికి చేరుకున్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం గురించి మీనాక్షి నటరాజన్‌తో చర్చించిన తమ్మల తాము 'పార్టీ బాగుండాలి... ప్రభుత్వానికి మంచి పేరు రావాలి' అనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పినట్టు తెలిసింది. ఇక ఉమ్మడి జిల్లాలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, తదితర విషయాలను ఆయన మీనాక్షి నటరాజన్‌కు వివరించినట్టు తెలిసింది. సీనియర్ నాయకుడిగా, మంత్రిగా తాను గిరిజన ప్రాంత అభివృద్ధికి, విద్యా, వైద్య సదుపాయాల మెరుగుదలకు గతంలో చేపట్టిన పనులతో పాటు ప్రస్తుతం నిర్వహిస్తున్న పనుల గురించి కూడా ప్రస్తావించినట్టు తెలిసింది. గోదావరి జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన సీతారామ ప్రాజెక్టు, తాను ఎమ్మెల్యేలతో చర్చించి చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదనల గురించి ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం.

'ముందస్తు'తో గందరగోళం


- రోహిణిలో వచ్చిన వానలకు విత్తనాలు వేయాలా? వద్దా?
- తర్జనభర్జనలో రైతులు
- ధైర్యం చేసి విత్తనాలు వేస్తున్న కొందరు..
- మున్ముందు పరిస్థితులపై ఆలోచిస్తున్న మరికొందరు
- తొందర పడొద్దంటున్న అధికారులు



ఖమ్మం వ్యవసాయం, మే 31(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందే వచ్చేశాయి. రోహిణిలోనే తొలకరి పలకరించగా.. 'ముందస్తు'గా పడుతున్న వానలతో రైతులు పంటల సాగుపై గందరగోళానికి గురవుతున్నాయి. సాధారణంగా వానాకాలం మొదలైన తర్వాత జూన్ మొదటి వారం నుంచి రైతులు విత్తనాలు వేస్తారు. అయితే ఈసారి వానాకాలం రాకముందే వర్షాలు విస్తారంగా కురుస్తుండడం, అవి తొలకరి వానలని, అల్పపీడన ప్రభావంతో కూడా పడుతున్నాయని చెబుతుండటంతో.. అన్నదాతలు గందరగోళంలో ఉన్నారు. గత నెలలో పడిన అకాల వర్షాల సమయంలోనే కూసుమంచి, మధిర, వైరా, సత్తుపల్లి, ఖమ్మం రూరల్ మండలాల్లో పలువురు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసి ఉంచి.. ఇటీవలి వానలకు పత్తి విత్తనాలు కూడా వేశారు. ఇక విత్తనాలు వేయని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. తొలకరి వానలు వస్తున్నాయని, చదును పనులు చేద్దామంటే వానల కారణంగా దుక్కులు సిద్ధం చేయలేని పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత వర్షాలకు విత్తనం వేయకపోతే నష్టపోతామేమోనని అని దిగులు చెందుతున్నారు.

'గులాబీ' ముప్పు తప్పదా?

ఇప్పటికే కొందరు పత్తి విత్తనాలు వేయగా పంట చివరి దశలో గులాబీ తెగులు బారిన పడే ప్రమాదముందని (మిగతా 6వ పేజీలో)



కేటీపీఎస్‌లో కరోనా కలకలం!

- ఓ కార్మికుడికి లక్షణాలు ఉన్నాయంటూ ప్రచారం
- అలాంటిదేమీ లేదని స్పష్టం చేసిన వైద్యులు

పాల్వంచ, మే 31 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో కరోనా కలకలం రేపింది. ఓ కార్మికుడికి కరోనా సోకిందన్న ప్రచారంతో శనివారం జిల్లావాసులు ఆందోళన చెందారు. కేటీపీఎస్ 7వ దశలో ఫోర్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ కార్మికుడు శనివారం స్వల్ప అస్వస్థతకు గురవగా.. అతను కేటీపీఎస్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాడు. కొవిడ్ లక్షణాలు ఉన్నాయని, నిర్ధారణ కోసం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి (మిగతా 6వ పేజీలో)

ఐటీఐలపై పర్యవేక్షణేదీ?

- కళాశాలల్లో అధ్యాపకుల కొరత
- కానరాని ట్రేడ్ పరికరాలు
- శిథిలావస్థలో పలు భవనాలు



ఖమ్మం ఖానాపురం హవేలి, మే 31 (ఆంధ్రజ్యోతి) : అయితే ఉద్యోగం వస్తుంది.. లేదంటే స్వయం ఉపాధి అయినా లభిస్తుందన్న ఆశతో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో చేరిన విద్యార్థులకు నిరాశ ఎదురవుతోంది. ఆయా ట్రేడ్లలో బోధించేవారులేక తరగతి గదుల్లో ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ఖమ్మం జిల్లాలో ఎనిమిది ప్రైవేటు, ఒక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ) ఉన్నాయి. వీటిలో ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, డీజిల్ మెకానిక్, వెల్డర్ తదితర కోర్సుల్లో సుమారు వెయ్యి మంది చదువుతున్నారు. కళాశాలల్లో సరైన సౌకర్యాలున్నాయా? లేదా? అని పరిశీలించడానికి అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కాలేజీల్లో తరగతులు నడవక, ప్రాక్టికల్స్ నిర్వహించక యాజమాన్యాలు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాట్సాప్ చదువులు..

చాలా ఐటీఐల్లోని విద్యార్థులకు కనీసం పుస్తకాలు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా విద్యార్థులకు వాట్సాప్ చదువులే దిక్కవుతున్నాయి. ఉన్న ఒక పుస్తకాన్ని అందరికీ ఇవ్వడం కుదరకపోవడంతో వాట్సాప్ గ్రూపులు పెట్టి.. వాటిలో ఆ పుస్తకాలకు సంబంధించి ఆ రోజు నేర్పిన అంశాన్ని ఫొటోలు తీసి పోస్టులు చేస్తున్నారు. దీంతో ఆ విద్యార్థులు ఆ మేసేజ్‌ల ఆధారంగా రికార్డుల్లోకి ఎక్కించుకుంటున్నారు. కళాశాలల్లో ట్రేడ్ల వారీగా వాట్సాప్ గ్రూపులను తయారు చేసి అందులో నోట్సును పోస్ట్ చేస్తున్నారని, వాటిని ఆధారంగా చేసుకుని విద్యార్థులు చదువులు కొగసాగిస్తున్నారనే వాదనలు వినపడుతున్నాయి.

అధ్యాపకులెక్కడ?

జిల్లాలో అధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఐటీఐలపై ఆసక్తి చూపుతున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి ఆయా కోర్సుల్లో అడ్మిషన్ పొందిన వారికి తీరా కాలేజీలకు వెళ్లగానే నిరాశే ఎదురవుతోంది. ఆయా కాలేజీలలో సంబంధిత సబ్జెక్టులను బోధించే అధ్యాపకుల కొరత కనిపిస్తోంది. దీంతో పలు కాలేజీలలో సీనియర్ విద్యార్థులతో (మిగతా 6వ పేజీలో)



'సేంద్రియ' పాపాలు!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పాల కేంద్రాలు
- కల్తీకి కేరాఫ్‌గా ఉమ్మడి జిల్లా
- నాణ్యమైన పాలతోనే సంపూర్ణం ఆరోగ్యం
- కేసుల నమోదులో ఉమ్మడి జిల్లా మూడో స్థానం
- నేడు ప్రపంచ పాల దినోత్సవం

6

వైభవంగా రామయ్య పట్టాభిషేకం


పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, హాజరైన భక్తులు

భద్రాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి శనివారం పట్టాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పుష్యమి నక్షత్రం రోజున స్వామి వారికి పట్టాభిషేకం నిర్వహించడం అనాధిగా వస్తున్న సంప్రదాయం. అందులో భాగంగా తొలుత స్వామి వారికినిత్య కల్యాణం నిర్వహించి అనంతరం పట్టాభిషేక కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం , కంకణదారణ, కలశాశాహన, శ్రీమద్రామాయణంలో పట్టాభిషేక ఘట్టం ప్రవచనంను దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. తరువాత కిరీటదారణ, ప్రోక్షణ, ప్రత్యేక ప్రసాద నివేదన చేసి భక్తులకు ప్రసాద పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు, పవన్‌కుమారాచార్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శనివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. స్వామి వారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఎటు చూసినా భక్తుల సందడి ఆలయ పరిసరాల్లో దర్శనమిచ్చింది.

సింగరేణిని అద్భుతంగా విస్తరింపజేస్తాం

- వచ్చే 30ఏళ్లలో 22మిలియన్ టన్నుల ఉత్పత్తికి కృషి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ప్రారంభం


సింగరేణి జీఎం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న భట్టి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థను ప్రపంచ వ్యాప్తంగా, అద్భుతంగా విస్తరింపజేస్తామని ఆ విస్తరణకు అవసరమైన సమాచారం, సూచనలను నియమించామని నివేదిక రాగానే కార్యాచరణ చేపడతామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొత్తగూడెం ఏరియాలో రూ.10కోట్లతో నిర్మించిన సింగరేణి జీఎం కార్యాలయ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్లకు పైబడిన సింగరేణి గనుల నుంచి లాభదాయకమైన టెక్నికల్, మినరల్స్ తవ్వే ఆలోచనలో ఉన్నామన్నారు. రాబోయే 30 ఏళ్లలో 22మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీసేందుకు వీలుగా కొత్తగనులు సిద్ధంగా ఉన్నాయని వివరించారు. సింగరేణి కార్మికుల రక్షణే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నామని ఆ తర్వాతే సింగరేణి వ్యాపారమన్నారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే రూ.కోటి ప్రమాద బీమాతో పాటు కారుణ్య నియామకం చేపడుతున్నట్టు తెలిపారు. ఇది దేశ చరిత్రలోనే ఒక రికార్డని, సింగరేణి యాజమాన్యం సింగరేణి ప్రాంతంలో ఉన్న గ్రామాల్లోనూ ప్రత్యేక నిధులు కేటాయించి ఆ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తుందన్నారు. దీంతోపాటు సింగరేణి కార్మికుల సంక్షేమానికి కూడా యాజమాన్యం పెద్దపీట వేస్తోందన్నారు. అలాంటి సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణి.. రాష్ట్రానికే అతిపెద్ద రంగ సంస్థ అని, కొన్నేళ్లపాటు అపారమైన బొగ్గును వెలికి తీసేందుకు సంస్థ నూతన బొగ్గుబావులను ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే అనేక నూతన బొగ్గు బావులను ఏర్పాటు చేస్తోందని, ఒరిస్సాలోని నైనీ బొగ్గు గనిని చేపట్టిందన్నారు. మరిన్ని నూతన బొగ్గుబావులను ఏర్పాటు చేసి ఉద్యోగ ఉపాధి అవకాశాలను ఏర్పాటుచేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరాంనాయక్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, సింగరేణి డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

'సేంద్రియ' పాపాలు!



నేడు ప్రపంచ పాల దినోత్సవం

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న పాల కేంద్రాలు
- కల్తీకి కేరాఫ్‌గా ఉమ్మడి జిల్లా
- నాణ్యమైన పాలతోనే సంపూర్ణం ఆరోగ్యం
- కేసుల నమోదులో ఉమ్మడి జిల్లా మూడో స్థానం

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 31 (ఆంధ్రజ్యోతి) : ఇప్పుడంతా సేంద్రియం పేరుతో వ్యాపారం సాగుతోంది. తినే, తాగే నిత్యావసర వస్తువులను విక్రయించే కొందరు వ్యాపారులు.. వినియోగదారులను ఆకట్టుకునేందుకు సహజసిద్ధమైనవంటూ ప్రచారం చేస్తూ.. వాటి మాటున కల్తీవి అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కారం, పసుపు నుంచి.. పాల వరకు అన్నిటిని కల్తీ చేస్తున్నారు. దీంతో కల్తీకి కేరాఫ్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లా మారుతోంది. ఇప్పటి వరకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సేంద్రియ వ్యవసాయంలో పంటలు, కూరగాయాలు సాగునే కనిపెట్టారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాల వ్యాపారులు ఏకంగా సేంద్రియ పాల పేరుతో పుట్టగోడుగుల్లా పాలు అమ్మకాల కేంద్రాలను ప్రారంభిస్తున్నారు. అస్సలు పాలల్లో స్వచ్ఛమైన పాలు ఉంటాయి కానీ సేంద్రియ పాలు ఏంటీ ..? అని కనీసం నోటీసులు ఇవ్వటంలో ఉమ్మడి జిల్లా ఆహారపు కల్తీ నివారణశాఖ అధికారులు వెనకడుగు వేస్తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. జంతువుల నుంచి మనుషుల వరకు పుష్టి నిచ్చే పాలపై ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు 2001 నుంచి యూనైటెడ్ నేషన్స్ ఫుడ్ ఎండ్ ఆగ్రీకల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జూలై 1న ప్రపంచ పాల దినోత్సవంగా జరుపుతుంది. ప్రజలకు పాలు, పాల ఉత్పత్తుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తొంది. పాలను ప్రపంచ ఆహారంగా అవగాహన కల్పిస్తొంది. పాడి పరిశ్రమపై బలోపేతం 2025 అవగాహన రూపొందించారు.

సేంద్రియ పాల పేరుతో అమ్మకాలు

చిన్నారుల ఎదుగుదలకు, మనుషుల పోషణకు అతి ముఖ్యమైన ఆహారం పాలు. ప్రతి ఒక్కరూ పాలను తీసుకోవాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే జంతువుల పొదుగు నుంచి వచ్చే పాలాల్లో ఎటువంటి కల్తీ ఉండదు. కానీ పాలు బయటకు వచ్చిన తర్వాత కల్తీ చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు కల్తీ పాల కాటుకు గురవుతున్నారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గతేడాది సేంద్రియ పాల పేరుతో పాల అమ్మకాల కేంద్రాలు పుట్టగోడుగుల్లా వ్యాపించాయి. ముఖ్యంగా ఖమ్మం నగరంలో ప్రధాన సెంటర్లలో సేంద్రియ పాలు, పాల ఉత్పత్తుల పేరుతో పోటాపోటీగా అమ్మకాలు జరుపుతున్నారు. పాలల్లో బెల్లంతో పాటు ఇతర పదార్థాలను కలిపి ఎరుపు రంగులోకి మార్చి సేంద్రియ పాలుగా ప్రజల్ని ఆకట్టుకునేలా ప్రచారం చేసి అమ్మకాలు జరుపుతున్నారు. ఇటీవల కాలంలో ఖమ్మం డీఎస్పీ కార్యాలయం ఎదుట సేంద్రీయ పాల అమ్మకం కేంద్రంపై వినియోగదారులు ఫిర్యాదు చేయటంతో జిల్లా ఆహారపు నాణ్యతా ప్రమాణాలశాఖ అధికారులు దాడులు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే నల్గొండ, హైదరాబాద్ తర్వాత కల్తీ పాల అమ్మకాల్లో ఖమ్మం జిల్లా మూడో స్థానంలో ఉంది. ప్రతి సంవత్సరం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 12 నుంచి 15 వరకు కేసులు నమోదు జరుగుతున్నాయి. వీరికి జాయింట్ కలెక్టర్ కోర్టులో జరిమానాలు విధిస్తున్నారు.

సేంద్రియ పాలు ఉండవు


కిరణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ప్రజల్ని నమ్మించేందుకు వ్యాపారులు సేంద్రియ పాల కేంద్రాల బోర్డులు పెడుతున్నారు. అలా బోర్డులు పెట్టటం నిషేధం. ఈ సంవత్సరం ఇప్పటి వరకు పాల కల్తీపై భద్రాద్రి కొత్తగూడెంలో 2, ఖమ్మం జిల్లాలో 7 కేసులు నమోదు జరిగాయి.

నాణ్యమైన పాలను ప్రజలు తీసుకోవాలి...

మురళీకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్, విజయపాలు

ప్రజలు నాణ్యమైన పోషక ప్రమాణాలు ఉన్న పాలు తాగటం ద్వారా మంచి ఆరోగ్యం కలుగుతుంది. తెలంగాణ పాడి పరిశ్రమ ద్వారా నాణ్యమైన పాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నాం. పాల డిమాండ్ మేరకు ఏ రోజుకారోజు పాలను మార్కెట్‌లోకి పంపిణీ చేస్తున్నాం. విజయ డైరీ పాలలో ఎటువంటి కల్తీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం.



అధికారుల అలసత్వం

రోగులకు ప్రాణ సంకటం

- ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి మరణాలు
- స్కానింగ్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులు
- విచారణలతోనే సరి

సత్తుపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లిలోని కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇటీవల కాలంలో వైద్యం వికటించి మరణాలు సంభవించటం, స్కానింగ్ సెంటర్లలో తప్పుడు రిపోర్టులు, ఒక రోగికి ఇవ్వాల్సిన రిపోర్టు మరో రోగికి ఇవ్వటం లాంటి వరుస సంఘటనలు జరగుతున్నా.. అధికారులు విచారణ చేస్తున్నామంటూ హడావిడి చేయటమే తప్ప చర్యలు శూన్యం. సత్తుపల్లిలో వరుస ఘటనలతో రోగులు ఇబ్బందులకు గురవుతూనే ఉన్నారు.

వరుస సంఘటనలతో బెంబేలు..

సత్తుపల్లి పట్టణంలో గతేడాది సత్తుపల్లిలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం వికటించి పలువురు మృత్యువాత పడిన సంఘటనలు విదితమే. సంఘటనలు జరిగిన వెంటనే సెటిల్‌మెంట్ల పేరుతో ప్రాణాలకు వెల కట్టి మరీ కొందరు వైద్యులు రోగుల తరఫు బంధువులకు డబ్బులు ముట్టజెప్పి యథావిధిగా అర్హత లేని వైద్యులు తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు కొన్ని స్కానింగ్ సెంటర్లు కూడా ఇష్టారాజ్యంగా తప్పుడు రిపోర్టు ఇస్తున్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సత్తుపల్లిలోని ఒక స్కానింగ్ సెంటర్ యజమాని తరచూ రోగులకు తప్పుడు రిపోర్టులు ఇవ్వటం దీనిపై ప్రశ్నిస్తే దౌర్జన్యానికి దిగుతున్నాడని పలువురు రోగులు ఆరోపిస్తున్నారు. కొందరు వైద్యుల అండదండలతో స్కానింగ్ సెంటర్ యజమాని రోగుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడని చెపుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్కానింగ్ సెంటర్ పని చేస్తున్నా ఇప్పటి వరకూ సంబంధిత అధికారులు ఎవరూ ఈ స్కానింగ్ సెంటర్‌వైపు కన్నెత్తి చూడకపోవటం వెనుక పెద్ద మొత్తంలో లావాదేవీలు ఉన్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తాజాగా రిపోర్టు మార్పు

ఇద్దరు గర్భిణులకు సంబంధించిన స్కానింగ్ రిపోర్టులను స్కానింగ్ సెంటర్ యజమాని మార్చిఇచ్చారు. ఈ సంఘటన వివాదంగా మారింది. వారం క్రితం భద్రాద్రి జిల్లా దమ్మపేటకు చెందిన ఆరు నెలల గర్భిణీ ఒకరు సత్తుపల్లిలోని ఒక వైద్యురాలి వద్ద పరీక్షించుకునేందుకు రాగా స్కానింగ్‌కు రాశారు. ఎన్‌వీఆర్ కాంప్లెక్స్‌లోని ఓ సెంటర్‌లో స్కానింగ్ చేయించుకున్నారు. అదే సమయంలో 9నెలల గర్భిణీ కూడా స్కానింగ్ చేయించుకున్నారు. 9నెలల గర్భవతి స్కానింగ్ రిపోర్టును ఆరు నెలల గర్భవతికి ఇవ్వగా వైద్యురాలు కూడా రిపోర్టు చూసి మందులు రాశారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విచారణ

స్కానింగ్ సెంటర్‌లో రిపోర్టు మారిపోయి గర్భిణి ఇబ్బందులకు గురైన విషయంపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సీతారాం శనివారం విచారణ జరిపారు. రికార్డులు పరిశీలించి జరిగిన సంఘటన వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుత సంఘటనకు సంబంధించి అయినా చర్యలు ఉంటాయా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి

- డిప్యూటీ సీఎం భట్టికి వినతి
- పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు మల్లవరపు రాజేష్



భట్టికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

చుంచుపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా ప్రజా పరిషత్, మండల ప్రజా పరిషత్‌లలో పని చేస్తున్న సూపరింటెండెంట్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని, ఫైనాన్స్ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వాటిని తక్షణమే విడుదల చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం శనివారం కోరింది. కొత్తగూడెంలో సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టిని మర్యాద పూర్వకంగా కలిసిన సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లవరపు రాజేష్ వినతిపత్రం అందించారు. వివిధ ఇతర శాఖల్లో ఇప్పటికే సూపరింటెండెంట్ స్థాయి అధికారి గెజిటెడ్ హోదాగా కొనసాగుతుందని వినతిలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2018 నుంచే ఎంపీపీ, జడ్పీపీల్లో సూపరింటెండెంట్లు గెజిటెడ్ హోదాలో ఉన్నారని గుర్తు చేశారు. సూపరింటెండెంట్‌లకు గెజిటెడ్ హోదా ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడదని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కౌన్సిలర్ వెల్ది ప్రసాద్, సూపరింటెండెంట్ అరుణ, సిబ్బంది శ్రావణి, కృష్ణ, వీవీవీ ప్రసాద్, సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు ఎంపీటీసీ, జడ్పీటీసీలలో రిజర్వేషన్లు కల్పించాలంటూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, తదితరులు డిప్యూటీ సీఎంకు వినతి పత్రాన్ని అందించారు.

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే సర్కార్ పాఠశాలల నిర్వీర్యం

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

జూలూరుపాడు, మే 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల మనుగడ రోజురోజుకి కష్టంగా మారుతుందని, గత పదేళ్లగా ప్రభుత్వాలు అనుసరించిన నిర్లక్ష్య వైఖరి కారణంగా ఏటేటా సర్కార్ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం తగ్గిపోయి నిర్వీర్యం అయ్యాయని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను నమోదు చేయించాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రచారజాతా శనివారం సాయంత్రం జూలూరుపాడుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, ఫీజుల భారం లేకుండా ఉచిత విద్యను పొందాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొగాకు సాగులో మార్పులు అవసరం..

- ఐసీఏఆర్, ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ మాగంటి శేషు
- గ్యాస్ ఆధారిత పొగాకు బ్యారెన్‌ను పరిశీలించిన శాస్త్రవేత్తలు
- రైతులకు అవగాహన కల్పించిన అధికారులు



గ్యాస్‌తో ఉడికించిన పొగాకును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం, అధికారులు

అశ్వారావుపేట రూరల్, మే 31(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో అధిక దిగుబడిని, నాణ్యమైన పొగాకును పొందెందుకు విప్లవాత్మక మార్పులు అవసరమని ఐసీఏఆర్, ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ అన్నారు.ఆంధ్రప్రదేశ్‌లోని జీలుగుమిల్లి జాతీయ వాణిజ్య పంటల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో అశ్వారావుపేట మండలంలో శనివారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని ఊట్లపల్లి సమీపంలో ప్రసిద్ధ రైతు కొడవటి వాసుదేవరావు పొగాకు తోటలో ఐసీఏఆర్, ఎన్ఐఆర్‌సీఏ, ఏవోసీఎల్, ఎమినెంట్ గ్యాస్ టెక్నాలజీ సంయుక్తంగా అభివృద్ధి చేసిన గ్యాస్ ఆధారిత పొగాకు బ్యారన్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు. రైతులకు కట్టెలు లేకుండా గ్యాస్‌తో పొగాకు ఎలా ఉడికంచవచ్చు, పాటించే నియమాలు, అందుకు అయ్యే ఖర్చులు, లాభాలను అధికారులు, శాస్త్రవేత్తలు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీఏఆర్, ఎన్ఐఆర్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్ మాట్లాడుతూ గత 30 ఏళ్లగా కలప వాడకం వల్ల అధికంగా వచ్చే కాలుష్యంతో పాటు పొగాకులో నాణ్యత, గ్రేడ్‌లు తగ్గుతూ వస్తుందన్నారు. గ్యాస్ ఆధారిత బ్యారన్ ద్వారా కాలుష్యం రాకుండా ఉండటంతో పాటు రైతులకు అధిక దిగుబడులు రావటం, నాణ్యమైన పొగాకు వస్తుందన్నారు. రైతులు నాణ్యమైన పొగాకును పొందేందుకు వినూత్న ప్రయత్నాలు చేయాలని సూచించారు. గ్యాస్ ఆధారిత క్యూరింగ్ టెక్నాలజీ ఆవిష్కరణకు కృషిచేసిన అధికారులను, పరిశోధన స్థానం ఉన్నతాధికారులను కొనియాడారు. కార్యక్రమంలో ఐవోసీఎల్ జనరల్ మేనేజర్ వర్నేకర్, సంస్థ చీఫ్ మేనేజర్ లలిత, పొగాకు బోర్డు విస్తరణ మేనేజర్ సురేఖ, పొగాకు బోర్డు ఆర్ఎం ప్రసాద్, ప్రాజెక్టు హెడ్ డాక్టర్ ఎల్‌కే.ప్రసాద్, ఎన్ఐఆర్‌సీఏ ఆర్ఎస్ హెడ్ డాక్టర్ సుబ్బయ్య, టి.వెంకటేశ్, రమేశ్, దేవానంద్, అధికారులు పాల్గొన్నారు.

సుంకం తగ్గింపుతో ఆయిల్‌పామ్‌కు నష్టం

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

అశ్వారావుపేట, మే31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ముడిచమురుపై దిగుమతి సుంకాన్ని తగ్గించటం వల్ల ఆయిల్‌పామ్‌కు తీవ్రనష్టం వాటిల్లుతుందని వ్యసాయశాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. దిగుమతి సుంకం నిర్ణయాన్ని పునః సమీక్షించాలని తుమ్మల శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. క్రూడ్ ఆయిల్ దిగుమతులపై కేంద్రం సుంకాన్ని తగ్గించటాన్ని తప్పుపట్టారు. రైతుల ప్రయోజనార్థం 27.5 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 40శాతంగా పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం తరుపున కేంద్రాన్ని అభ్యర్థించిందన్నారు. దీనికి విరుద్ధంగా కేంద్రం దిగుమతి సుంకాన్ని తగ్గించటం బాధాకరమన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి శివరాజ్‌శింగ్ చౌహాన్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

ఐటీఐలపై పర్యవేక్షణేదీ?

(5వ పేజీ తరువాయి)

బోధన సాగిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఐటీఐ కాలేజీలకు అనుమతిచ్చే సమయంలో పూర్తి స్థాయి అధ్యాపకులను చూపే యాజమాన్యాలు అనంతరం వారిని కొనసాగించడం లేదని తెలుస్తోంది. కేవలం కొందరి సర్టిఫికెట్లను తీసుకుని అధ్యాపకులుగా చూపుతున్నారని విమర్శలు వస్తున్నాయి.

ప్రాక్టికల్స్ లేవు..

ఐటీఐ అంటేనే ప్రాక్టికల్స్‌తో కూడి ఉన్న చదువు. కానీ జిల్లాలోని ఐటీఐ కాలేజీల్లో పారిశ్రామిక శిక్షణ తూతూ మంత్రంగా సాగుతోంది. సరైన పరికరాలు లేకపోవడంతో శిక్షణ సాగడం లేదు. మరమ్మతులకు నోచుకోని పరికరలాలతో శిక్షణ సాగడం లేదు. పాడైపోయిన పరికరాలను బాగు చేయించకుండానే ప్రదర్శనకు ఉంచినట్లు చూపుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు.

హాజరుకాకపోయినా..

ఆరు నెలల నుంచి రెండేళ్ల పాటు కొనసాగే పారిశ్రామిక శిక్షణా కాలంలో ప్రతీరోజు కళాశాలకు వెళితేనే ఆయా ట్రేడ్లలో విద్యార్థులకు పట్టు లభిస్తుంది. అయితే చాలా కాలేజీల్లో తరగతులకు రాకున్నా డబ్బులు తీసుకుని వారికి సరిపడా హాజరు వేస్తున్నారనే విమర్శలున్నాయి. జిల్లాలో బయోమెట్రిక్ హాజరు విధానం అమలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారురుల ఐటీఐలపై పర్యవేక్షణ ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

శ్రీనివాసరావు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్

జిల్లాలో ఉన్న ప్రైవేటు ఐటీఐ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ల్యాబ్‌లలో సరైన పరికాలు, విద్యార్థుల హాజరుశాతం తప్పనిసరిగా ఉండాలి. నిపుణులైన అధ్యాపక బృందం కూడా తప్పనిసరిగా ఉండాలి. జిల్లాలోని ఎక్కడైనా ఐటీఐలలో ఉన్న సమస్యలపై ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తాం. అవసరమైతే సంబంధిత కళాశాలల బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

కేటీపీఎస్‌లో కరోనా కలకలం!

(5వ పేజీ తరువాయి)

వెళ్లాలని సూచించారు. దీంతో అతను పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను సంప్రదించగా పరీక్షించి కొవిడ్ లక్షణాలేవీ లేవని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయాడు. కానీ ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఓ కేటీపీఎస్ కార్మికుడికి కరోనా సోకిందంటూ సోషల్‌మీడియాలో జరిగిన ప్రచారంతో అధికారులను కూడా కంగారు పడ్డారు.

అప్రమత్తం చేసిన యాజమాన్యం..

దేశవ్యాప్తంగా కొవిడ్ మహమ్మారి రోజురోజుకూ విజృంభిస్తున్న నేపథ్యలో కేటీపీఎస్ 7వ దశ యాజమాన్యం కార్మికులను అప్రమత్తం చేస్తూ శనివారం సర్క్యులర్ జారీ చేసింది. కార్మికులు విధులకు హాజరయ్యే సమయంలో భౌతిక దూరం పాటించాలని, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని, పని ప్రదేశాల్లో చేతులను శుభ్రం చేసుకోవాలని, శానిటైజర్లు వినియోగించాలని సూచించింది.

'ముందస్తు'తో గందరగోళం

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పంట సాగుకు ఇప్పుడే తొందర పడొద్దని సూచిస్తున్నారు. జిల్లాలో ముందు నుంచి జూన్ రెండో వారంలో విత్తనాలు వేయడం సాధారణం. ఇప్పుడు అదే పద్ధతిని రైతులు అనుసరించాలని సూచిస్తున్నారు.తొందరపడి విత్తనాలు వేస్తే ప్రధానంగా గులాబీ తెగులుతో పాటు ఇతర చీడపీడల బారిన పడే ఆస్కారం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. మొత్తంగా ముందస్తు వానలు జిల్లాలో నిరంతర సాగు పద్ధతుల్లో వెళ్లే రైతులను అయోమయానికి గురిచేస్తున్నాయి.

తేమ పెరిగాకే విత్తనాలు..

నల్లరేగడి భూముల్లో 60 మిల్లీమీటర్ల నుంచి 80మిల్లీమీటర్ల వర్షపాతం, చెలక భూముల్లో 75 మిల్లీమీటర్ల నుంచి 100మి.మీ.ల వర్షపాతం నమోదైన తర్వాత విత్తనాలు వేసుకోవాలి. ఈసారి వ్యవసాయానికి అనుకూలమైన వర్షాలున్నాయి. మోస్తరు నుంచి భారీ వర్షాలు కురువనున్నాయి. తొలకరి వర్షాలు కురిసిన నేపథ్యంలో దుక్కులను సాగుకు సిద్ధం చేసుకోవాలి. భూమిలో తేమ శాతం పెరిగాకే విత్తనాలు వేయాలి. నైరుతి రుతుపవనాలకు తోడు అల్ప పీడన ప్రభావం ఉండడంతో ఉరుములు, మెరుపులు వస్తున్నాయి. జూన్ మొదటి వారం తర్వాత విత్తనాలు వేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు.

దశల వారీగా సౌర విద్యుత్ అభివృద్ధి

(5వ పేజీ తరువాయి)



వల్లభి, అన్నారుగూడెం గ్రామాలను ఈపథకం కింద ఎంపిక చేశాం. భద్రాద్రి జిల్లా లోనూ 15 గ్రామాలను ఎంపికచేశాం. అశ్వాపురం, సారపాక, నాగినేనిప్రోలు, చర్ల, బాబు క్యాంపు, మందలపల్లి, సమితి సింగారం, ములకలపల్లి, భద్రాచలం, బూర్గంపాడు, చంద్రుగొండ, రుద్రంపూర్, దమ్మపేట, మణుగూరు మండలం కూనవరం, సుజాత నగర్ ఆ జాబితాలో ఉన్నాయి. ఆరునెలల్లో ఏగ్రామంలో సోలార్ వినియోగిస్తారో ఆగ్రామాన్ని మోడల్‌గా ఎంపికచేసి రూ.కోటి అందిస్తాం.

ఆంధ్రజ్యోతి: గిరిజల సౌరవికాస పథకం అమలెలా ఉంది?

డీఎం: దీని ద్వారా నూటికి నూరుశాతం గిరిజన రైతుల పోడుభూములకు సోలార్ పంపుసెట్లు అందిస్తాం. పైలెట్ ప్రాజెక్టుగా చంద్రుగొండ మండలం బెండాలపాడును ఎంపికచేసి ఇప్పటికే సోలార్ ద్వారా విద్యుత్‌తో పోడుభూములకు సాగునీరందించాం. భద్రాద్రి జిల్లాలో చంద్రుగొండ మండలాన్ని ఎంపిక చేశాం. ఖమ్మం జిల్లా లోనూ పోడుభూములు అధికంగా ఉన్న మండలాన్ని ఎంపిక చేసి అమలు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: మహిళా సంఘాల ద్వారా ఏర్పాటుకు కార్యాచరణ ఉందా?

డీఎం: మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు బ్యాంకులనుంచి రుణాలు ఇస్తారు. వారు పెట్టే ప్లాంట్ నుంచి విద్యుత్‌నుప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. ఖాళీస్థలాలు గుర్తించి మహిళ సంఘాలకు ఇవ్వడం ద్వారా అక్కడ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. ఇందు కోసం మహిళా సంఘాలను గుర్తిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గతంలోలా గృహ అవసరాల కోసం లైట్లు, ఫ్యాన్లను సబ్సిడీపై ఇస్తున్నారా?

డీఎం: గతంలో ఇలాంటి పథకాలు ఉండేవి. ప్రస్తుతం వీటిని అమలు చేయడంలేదు. ఇప్పుడు వినియోగదారుల నుంచే సోలార్ విద్యుత్ ఉత్పత్తి అయ్యేలా యూనిట్ నెలకొల్పేందుకే ప్రాధాన్యమిస్తున్నాం. జిల్లాలో ఎవరైనా సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొస్తే అన్ని విధాలా సహకారం అందిస్తాం.

(5వ పేజీ తరువాయి)

అందుతున్నాయో.. ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తుందో పూర్తి వివరాలను త్వరలోనే ఇంటింటికి అందజేస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ధరణి పేరుతో అసైన్డ్ భూములను కాజేస్తుంటే ఆందోళన చేశామని, ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని నాడు చెప్పినట్టుగానే అధికారంలోకి వచ్చాక ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూ భారతి చట్టాన్ని అమలు చేయబోతున్నామన్నారు. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా స్వయం ఉపాధి పథకంలో గిరిజనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.1000 కోట్లను మంజూరు చేసిందన్నారు. అడవి బిడ్డలు, ఆదివాసీ గిరిజనుల కోసం ఇందిర సౌరజల గిరిజన వికాస పథకం ద్వారా రాష్ట్రంలో 6.70లక్షల ఎకరాలకు రూ.12,500కోట్లు ఖర్చు చేసి అడవి, బీడు భూములను సస్యశ్యామలం చేసి సాగులోకి తీసుకొచ్చేందుకు ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు.

చట్టాలను, హక్కులను పరిరక్షించాలి

గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని దీని కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. గిరిజనులను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా కూడా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ అడవి బిడ్డలకు పోడుభూముల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేందుకు ఆర్థికంగా వారికి చేయూతనందించాలన్నారు. అన్ని రకాలుగా గిరిజనులను చైతన్య పరిచేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివాసీలకు శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. ఆదివాసీలు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె పిలుపునిచ్చారు.

గిరిజన సంక్షేమమే ధ్యేయం

శ్రమదానం చేసిన మంత్రి పొంగులేటి, మీనాక్షి

కిన్నెరసాని గిరిజన బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి శ్రమదానం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి ఆ ప్రాంతంలో మొక్కలు నాటారు. వారితో పాటు మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్‌నాయక్ కూడా పాల్గొన్నారు.



హాజరైన పీసీసీ చీఫ్ మహేష్, తదితరులు



మొక్కను నాటుతున్న మంత్రి పొంగులేటి

పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసి కృషి చేస్తున్నామని తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలోనే అటవీ భూములకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను అంద జేసిందని, గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో చేయూతనిచ్చిందన్నారు.

రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, గతంలో ఇందిరాగాంధీ హయాంలో సుమారు 25లక్షల ఎకరాల అసైన్డ్‌భూములను గిరిజనులకు పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఆ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాయకులు పక్కదోవపట్టించారన్నారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విధానాలతో పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు తమ ప్రజాప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు, కాంగ్రెస్ జార్ఖండ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ కొప్పుల రాజు, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్, జారె ఆదినారాయణ, మట్టా రాగమయి, భద్రాద్రి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమ్మడిజిల్లా ప్రజాప్రతినిధులతో మీనాక్షి భేటీ

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ శనివారం అంతర్గత సమావేశం నిర్వహించారు. పాల్వంచ కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాలలో జరిగిన కాంగ్రెస్ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపునకు హాజరైన ఆమె.. పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో ఉమ్మడి ఖమ్మం ప్రజాప్రతినిధులతో భేటీ అయ్యారు. భద్రాద్రి జిల్లాకు చెందిన నలుగురు గిరిజన ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు,కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్‌తోపాటు మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన, పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలు తెలుసుకున్నట్టు సమాచారం. ఎమ్మెల్యేల రాజకీయ అనుభవం, గతంలో నిర్వర్తించిన పదవులు, తదితర వివరాలు కూడా సేకరించినట్టు తెలిసింది. ముఖ్యంగా ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలపైనే ఎక్కువగా ఆరా తీసినట్టు తెలిసింది. ఈ క్రమంలో అయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతుబంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని మీనాక్షికి వివరించినట్టు తెలిసింది. ఇదే సమయంలో డిప్యూటి సీఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా మీనాక్షి నటరాజన్‌ను వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిసి.. కొద్దిసేపు ఆమెతో భేటీ అయ్యారు.

పదేళ్లలో సబ్‌ప్లాన్ నిధులు ఖర్చు చేయలేదు

- మేం వచ్చాక 17,169కోట్ల కేటాయింపు
- గిరిజనుల హక్కులు కాపాడేలా నల్లమల్ల డిక్లరేషన్ ఇచ్చాం: భట్టి విక్రమార్క
- గిరిజనుల హక్కులను రక్షించాలి: మీనాక్షి

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ సర్కారు గిరిజనుల కోసం సబ్‌ప్లాన్ నిధులను ఏ మాత్రం ఖర్చు చేయలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.17,169కోట్లను కేటాయించామని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసానిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కాంగ్రెస్ తెలంగాణ ఆదివాసీ కార్యకర్తల సమ్మేళనం ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో సబ్‌ప్లాన్ నిధులను పారదర్శకంగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గిరిజనుల అవసరాలేంటో తెలుసుకునేందుకు ఆ వర్గాలకు చెందిన నాయకులను ఒకచోట చేర్చి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. అడవి బిడ్డలు ఆత్మగౌరవంతో జీవించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా సౌర జల గిరిజన వికాస పథకం తీసుకొచ్చిందని వెల్లడించారు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు నల్లమల్ల డిక్లరేషన్ తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నాటరాజన్ మాట్లాడుతూ.. గిరిజనుల చట్టాలను, హక్కులను పరిరక్షించి వారిని అన్నిరంగాల్లో ముందు వరుసలో నిలపాలన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులన్నీ పరిరక్షించినప్పుడే వారు అభివృద్ధిలో ముందుకు వెళ్తారని, దీనికోసం కాంగ్రెస్ ఎల్లప్పుడు కృషి చేస్తుందన్నారు. పోడు భూముల్లో సాగు చేసుకుని జీవనం సాగించేందుకు అడవి బిడ్డలకు ఆర్థికంగా చేయూతనందించాలనిసూచించారు. పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజనుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నాడు ఇందిరాగాంధీ నుంచి ఇప్పటి సోనియాగాంధీ వరకు గిరిజనుల అభివృద్ధికోసం,వారిని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు.



పాల్వంచలో ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో మాట్లాడుతున్న భట్టి

ప్రభుత్వ పనితీరుపై మీనాక్షి ఆరా

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మీనాక్షి నటరాజన్ శనివారం పాల్వంచలోని జెన్కో అతిథిగృహంలో అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ ఒక్కో ఎమ్మెల్యేతో వేర్వేరుగా మాట్లాడి.. వారి నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వ పని తీరు బాగానే ఉందని, రుణమాఫీ, రైతు బంధు పథకం అందరికీ అందలేదన్న వ్యతిరేకత కొంత ఉందని ఆమె వివరించినట్టు తెలిసింది.

కొందరు బీజేపీ సీనియర్లతో కేసీఆర్‌కు సంబంధాలు



- ఆ కారణంగానే పార్టీ అధ్యక్ష పదవి నుంచి బండిని తప్పించారు
- గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పిన వారే బీజేపీ అభ్యర్థులు: మహేశ్ గౌడ్

కొత్తగూడెం, మే 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని, కొందరు బీజేపీ సీనియర్ నాయకులతో కేసీఆర్‌కు సంబంధాలున్నాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ సంబంధాల కారణంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ను తొలగించారన్నారు. రేపో.. మాపో.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కిన్నెరసాని గురుకుల పాఠశాల ఆవరణలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదివాసీ గిరిజన కాంగ్రెస్ సమ్మేళనం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మహేష్ గౌడ్ మాట్లాడారు. 'బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ చెప్పినట్టే గత ఎన్నికల్లో కేసీఆర్ చెప్పినట్టుగానే బీజేపీ తమ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి తెలంగాణలో పునాదులు లేవు.. ఆ పార్టీ ఇక్కడ అధికారంలోకి రావడం కలే.. రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉంది. అన్ని వర్గాల ప్రజలకు చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పార్టీ బలోపేతమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల వల్ల.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పనిసరిగా కాంగ్రెస్ 90 సీట్లు గెలుచుకుంటుంది' అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్.. ఒక్కటేనని బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని, ఆయన ఇంకా యువ మోర్చా నాయకుడిలా మాట్లాడటం సరికాదన్నారు.

అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధే లక్ష్యం: కేటీఆర్

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ అభివృద్ధి చెందాలన్నదే తమ అభిమతమని, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఇంగ్లాండ్‌లోని వార్విక్ యూనివర్సిటీలో ప్రాగ్మటిక్ డిజైన్ సొల్యూషన్స్ లిమిటెడ్ (పీడీఎస్ఎల్) నాలెడ్జ్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దిగ్గజ కార్పొరేట్ సంస్థలకు తెలంగాణ బిడ్డలు సేవలందించడం గర్వకారణం అన్నారు. పెట్టుబడులు వచ్చి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు దొరకాలని, అందుకోసం సర్వశక్తులు ఉపయోగిస్తామని చెప్పారు.

కేసీఆర్‌కు నోటీసులంటే.. తెలంగాణకు ఇచ్చినట్లే

ఆయనపై ఈగ వాలినా ఊరుకోం.. కాళేశ్వరం కమిషన్ నోటీసులకు వ్యతిరేకంగా 4న ఇందిరాపార్క్‌వద్ద ధర్నా

- జాగృతి నూతన కార్యాలయం ప్రారంభం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. తెలంగాణ జాతిపిత అని, ఆయనకు నోటీసులు ఇవ్వడమంటే యావత్తు తెలంగాణకు నోటీసులిచ్చినట్లేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. కేసీఆర్‌పై ఈగ వాలినా తాము ఊరుకోబోమని హెచ్చరించారు. కేసీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఒక కన్ను అయితే.. తెలంగాణ జాగృతి మరో కన్ను అని తెలిపారు. కాళేశ్వరం కమిషన్ కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 4న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసం సమీపంలో తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని కవిత ప్రారంభించారు. కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించిన అనంతరం బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గోదావరి జలాల్లో 200 టీఎంసీల హక్కు తెలంగాణకు ఉండాలని కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని తెలిపారు. "కాళేశ్వరం ద్వారా ఏటా 20 లక్షల ఎకరాలకు నీళ్లు అందించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారా? కోటి ఎకరాల మాగాణంగా తెలంగాణను చేసినందుకు నోటీసులు ఇచ్చారా ? రైతు బీమా, రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టినందుకు ఇచ్చారా? తెలంగాణ ప్రజలకు మేలు చేసినందుకు ఇచ్చారా? అది కాళేశ్వరం కమిషనా? లేక కాంగ్రెస్ కమిషనా?"అని కవిత ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం పట్ల ప్రతి తెలంగాణ బిడ్డ బాధపడుతున్నారని అన్నారు.


జాగృతి కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పూజలు చేస్తున్న కవిత

నీళ్లు తరలించుకుపోతుంటే మాట్లాడరేం?

ఏపీ సీఎం చంద్రబాబు బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణ నీళ్లను తరలించుకుపోతుంటే సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం అంత బలహీనంగా ఎందుకున్నారని, పక్క రాష్ట్రాల ప్రయోజనాల కోసం ఎందుకు పనిచేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు నదుల అనుసంధానాన్ని తుపాకులగూడెం నుంచి చేపట్టేలా ప్రతిపాదించారని, కానీ.. ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకుండా ఇచ్చంపల్లి నుంచి చేపడతామని చెప్పిందని అన్నారు. కానీ, ఇప్పుడు పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి నీళ్లను తరలించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. జూన్ 2 నాడు సీఎం రేవంత్‌రెడ్డి ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం జై తెలంగాణ అనకపోవడం మన ఖర్మ అని, తెలంగాణ గ్రహచారం బాగాలేక రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని కవిత వ్యాఖ్యానించారు. జై తెలంగాణ అనని వారికి, అమరవీరులకు నివాళులర్పించని వారికి సీఎం కుర్చీలో కూర్చొనే అర్హత లేదన్నారు. ఇప్పటికైనా రేవంత్ జై తెలంగాణ అనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పిడికిలెత్తి బయటికి వస్తేనే తెలంగాణ వచ్చిందని, దానివల్లే ఇవాళ అధికారంలో ఉన్నామన్న విషయాన్ని వారు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఆ విషయాన్ని మరిచిపోయి కేసీఆర్‌కు నోటీసులివ్వడం దారుణమన్నారు. యువతకు స్వయం ఉపాధి కోసం ప్రారంభిస్తున్న రాజీవ్ యువ వికాసం పథకం పేరు మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు ఎటువంటి సంబంధంలేని రాజీవ్‌గాంధీ పేరు పెట్టడం సరికాదన్నారు. అమరులు శ్రీకాంతచారి, యాదిరెడ్డి, ప్రజాకవి కాళోజీ, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు పెట్టాలని సూచించారు. రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆమోదించకుండా తాత్సారం చేస్తోందని కవత మండిపడ్డారు. ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్ రెడ్డి కలిసిన సమయంలో ప్రాజెక్టుల గురించి మాట్లాడారు తప్ప.. బీసీ బిల్లు మీద మాట్లాడలేదని ఆరోపించారు. బీసీ బిల్లును డీప్ ఫ్రిడ్జ్‌లో పెట్టే ప్రయత్నం చేస్తే బీజేపీకి సెగ తాకేలా పోరాటం చేస్తామని హెచ్చరించారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించే వరకు జాగృతి పోరాటం చేస్తుందని అన్నారు.

జాగృతి కమిటీల ఏర్పాటు..

మైనారిటీల హక్కుల కోసం కూడా జాగృతి పోరాటం చేస్తుందని కవిత ప్రకటించారు. జాగృతిలో మైనారిటీల హక్కుల కోసం ముస్లిం, సిక్కు, క్రిస్టియన్ విభాగాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాగృతి తరఫున ఎస్సీ, ఎస్టీ విభాగాన్ని ఏర్పాటు చేసి ఆ వర్గాల కోసం ఉద్యమిస్తామన్నారు. అయితే, తాము పోరాటాలు చేస్తుంటే కొంతమంది ఓర్వడం లేదన్నారు. తెలంగాణ కోసం బీజేపీ నాయకులు మాట్లాడకపోవడం దారుణమని, 8మంది ఎంపీలను గెలిపించినా కేంద్రం నుంచి రూపాయి తీసుకురాలేదని విమర్శించారు. గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను కాపాడకపోతే తెలంగాణ జాగృతి పవర్ చూపిస్తామన్నారు. కాగా, తెలంగాణ జాగృతి కార్యాలయ కార్యదర్శిగా పొన్నమనేని బాలాజీరావును నియమిస్తున్నట్లు ఆ కార్యాలయం తెలిపింది.

బీజేపీతో పొత్తు ఉంటుందని ఏమార్చారు

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లోకి.. వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఇదే చెప్పారు: సంజయ్



కరీంనగర్, మే 31(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీలోని చాలా మంది ఎమ్మెల్యేలు బీజేపీతో టచ్‌లోకి వచ్చారని.. అలా జరిగిన ప్రతిసారీ కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమై కమలంతో పొత్తు పెట్టుకుంటామని చెప్పి వారిని కాషాయ గూటికి రాకుండా చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బీఆర్ఎస్ అంటేనే అవినీతి పార్టీ అని, కవితను అరెస్టు చేయకుండా ఉండటానికి బీజేపీతో కలవడానికి బీఆర్ఎస్ ప్రయత్నించిందని చెప్పారు. కుటుంబ పార్టీని తాము దగ్గరకు రానివ్వలేదని తెలిపారు. శనివారం కరీంనగర్‌లో సంజయ్ విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్, హరీశ్‌రావు భేటీ విషయం తెలియదని, ఇదంతా కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా అని తెలిపారు. కవిత విషయంలోనూ అదే డ్రామా నడుస్తోందని చెప్పారు కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నిర్మాణ దర్శకత్వంలో కవిత పాత్రధారిగా చార్‌పత్తా సినిమా నడుస్తోందన్నారు. కవిత ఎపిసోడ్‌తో ప్రజలకు మేలు జరుగుతుందా..? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై చర్చ జరగకుండా చిట్‌చాట్‌ల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే కుట్ర జరుగుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ముమ్మాటికీ దేశద్రోహమే అని సంజయ్ అన్నారు. సైన్యం ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా, పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి, కాళేశ్వరం ప్రాజెక్టు, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫాంహౌస్, ఫార్ములా-ఈ రేసు కేసుల విషయంలో అరెస్టులు ఉంటాయని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని చూస్తున్నాయని, వాళ్లెన్ని కుట్రలు చేసినా అది జరగదని చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయ పరిధిలో 18 గోవులు చనిపోవడంపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరికాదని సంజయ్ అన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియ వేగవంతం


పుస్తకాల రవాణాను పరిశీలిస్తున్న డీఈవో

కొత్తగూడెం అర్బన్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల సౌలభ్యం కోసం బడులు తెరిచే నాటికే వారికి పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలనే సంకల్పంతో జిల్లా విద్యాశాఖ జిల్లాలో పాఠ్య పుస్తకాల పంపిణీ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే జూన్ 3 నాటికి పాఠ్య పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రక్రియను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే శనివారం డీఈవో వెంకటేశ్వరాచారి స్వయంగా రంగంలోకి దిగి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాత కొత్తగూడెం పుస్తకాల గోదాం నుంచి రెసిడెన్షియల్ పాఠశాలలకు, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, గురుకుల పాఠశాలలకు పుస్తకాలను చేరవేశారు.

వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు, మండల విద్యా వనరుల కేంద్రాలకు గోదాం నుంచి పాఠ్య పుస్తకాలను చేరవేయనున్నట్లు డీఈవో తెలిపారు. జిల్లాకు 5,08,400 పాఠ్య పుస్తకాలు అవసరముండగా ఇప్పటి వరకూ 4,54,925 పుస్తకాలు జిల్లాకు చేరాయని, అందులో యిప్పటివరకూ 59శాతం పుస్తకాలను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.

శభాష్ డాక్టర్లు..

- గిరిజన యువతికి ప్రాణం పోసిన భద్రాచలం వైద్యులకు అభినందనలు
- ఎక్స్‌లో పోస్టు చేసిన వైద్యశాఖ మంత్రి

భద్రాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పురుగుల మందు తాగి చావు బతుకుల మధ్య ఉన్న మడకం శిరీషకు అధునాతన వైద్య చికిత్స అందించి ప్రాణం పోసిన వైద్యులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నరసింహ అభినందించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన 'ఆంధ్రజ్యోతి' కథనంను పోస్టు చేసి వైద్యులకు అభినందనలు తెలిపారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, వైద్యశాల సూపరింటెండెంట్ ముదిగొండ రామకృష్ణ, ఊపిరితిత్తుల వైద్యుడు జగదీష్‌తో పాటు వైద్య సిబ్బందిని ఆయన పేరు పేరున అభినందించారు. గిరిజన యువతి ప్రాణాలు కాపాడేందుకు రేయింబవళ్లు శ్రమించిన వారి సేవలు మరువలేవమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యశాలలో క్రిటికల్ కేర్ వెంటిలేటర్ సేవలు గిరిజనులకు అందుబాటులో ఉండటం వలనే సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో ప్రభుత్వ వైద్యశాలలను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం మరింత అంకితభావంతో ఉందని ఆయన తెలిపారు.

గాయపడిన డ్రైవర్ మృతి

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): వైరాకు సమీపంలోని జాతీయ ప్రధాన రహదారిలో ఉన్న వైరా నది హైలెవల్ వంతెనపైన శుక్రవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న లారీ డ్రైవర్ షేక్ మహబూబ్‌సుభానీ అలియాస్ మున్నా(32) శనివారం మృతిచెందాడు. విజయవాడకు చెందిన మున్నా ఇనుపచువ్వల లోడ్‌తో ఉన్న లారీ డ్రైవర్. హైలెవల్ వంతెన వద్ద ఒక డీసీఎం వ్యాన్, కారును వేగంగా ఢీకొట్టి కారుతో సహా 50అడుగుల లోతులో లారీ పల్టీకొట్టింది. లారీ క్యాబిన్ నుజ్జునుజ్జు అయి మున్నాకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు లారీ క్యాబిన్‌లో చేయి ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన మున్నాను అతి కష్టం మీద బయటకు తీసి చికిత్స కోసం 108లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మున్నా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విజయవాడకు చెందిన మున్నాకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేజీ పినపాక గ్రామం వద్ద పెట్రోల్ బంకుల సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి డీసీఎం వ్యాన్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని విప్పలమడక గ్రామానికి చెందిన అక్కిశెట్టి కృష్ణారావు హమాలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి హమాలీ పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై విప్పలమడకలోని ఇంటికి వెళ్తూ పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకొని బయటకు వస్తున్న సమయంలో కృష్ణారావును తల్లాడ నుంచి వైరా వస్తున్న వ్యాన్ వేగంగా ఢీకొట్టింది. కృష్ణారావుకు గాయాలయ్యాయి. 108 వాహనంలో కృష్ణారావును చికిత్స కోసం ఖమ్మం తరలించారు.

కారు, బైక్ ఢీ

మధిర రూరల్, మే31(ఆంధ్రజ్యోతి): మధిరలోని వైరారోడ్డు లోరెస్టారెంట్ సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో శనివారం ఒకరికి గాయాలయ్యాయి. కారు, ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై ఉన్న మధిరకు చెందిన దర్శి వెంకటేశ్వర్లుకు గాయాలయ్యాయి.

స్పోర్ట్స్ అకాడమీల్లో ఖాళీల భర్తీకి ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, మే 31(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా స్టేట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్పోర్ట్స్ అకాడమీల్లో ఖాళీల భర్తీకి ఈ నెల 10వ తేదీ నుంచి 13 వరకు ఎంపికలు నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో సునిల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10, 11 తేదీలలో హన్మకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు హన్మకొండ జేఎన్ స్టేడియంలో, ఈనెల 12న ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ ఎంపికలు ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో, ఈనెల 10, 11 తేదీలలో సైక్లింగ్, రెజ్లింగ్, వెలోడ్రోమ్ అకాడమీ ఎంపికలు ఓయూ క్యాంపస్ తార్నాకలో, ఈనెల 10న సరూర్‌నగర్, రాజన్నసిరిసిల్ల వాలీబాల్ అకాడమీల ఎంపికలు రాజన్నసిరిసిల్లలో, జూన్ 1న సిద్ధిపేట వాలీబాల్ అకాడమీ ఎంపికలు సిద్ధిపేటలో, ఈనెల 12, 13 తేదీల్లో మహబూబ్‌నగర్‌లలో గల వాలీబాల్ అకాడమీల ఎంపికలు మహబూబ్‌నగర్‌నగర్ అకాడమీలో, ఈనెల12న వనపర్తి హాకీ అకాడమీ ఎంపికలు వనపర్తిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు సంబంధించిన వయస్సు, ఇతర అర్హతలు తదితర సమాచారం కోసం సర్దార్ పటేల్ స్టేడియంలో నేరుగా కాని 94900 21220నెంబరు ద్వారా సంప్రదించాలని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి కోరారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

భద్రాచలం, మే 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే నాటికి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు సమకూరేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్ అన్నారు. శనివారం హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ సీతాలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డితో కలిపి వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఐటీడీల వారీగా పాఠశాలల్లో కల్పించాల్సిన వసతులపై సమీక్ష నిర్వహించారు. వేసవి సెలవులకు విద్యార్థులు ఇళ్లకు వెళ్లినందున పాఠశాల గదుల్లో డైనింగ్ హాలు, ఆవరణ, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్, పెయింటింగ్, బాత్రూంలకు ఏమైనా మైనరు రిపేర్లు ఉంటే దానికి సంబంధించిన ప్రతిపాదనలు సంబంధిత డీఈ, ఏఈలు ఐటీడీఏ పీవో అనుమతి తీసుకొని మంగళవారం వరకు పంపించాలని కోరారు. జూన్ 12 కంటే వారం రోజుల ముందే పాఠశాలల్లో ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే పనులు ప్రారంభించాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ రిపేర్లకు సంబంధించి ప్రతిపాదనలు ప్రత్యేక అధికారుల ద్వారా తెప్పించుకొని గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శికి పంపిస్తామని పేర్కొన్నారు.

రక్త పరీక్ష కేంద్రంలో చోరీ

- రూ.1.50 లక్షల అపహరణ

మణుగూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని ఓ రక్త పరీక్ష కేంద్రంలో శనివారం ఉదయం చోరీ జరిగింది. రక్త పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్న ముగ్గురు మహిళలు లక్షన్నర నగదును అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పగిడేరు గ్రామానికి చెందిన తల్లీ కూతుర్లు శ్రీరాము అరుణ, కంచర్ల నాగమణి తమ ఫెర్టిలైజర్ దుకాణం నుంచి అవసరాల నిమిత్తం ఓ సంచిలో లక్షన్నర నగదును తీసుకుని పట్టణంలోని అమూల్యా రక్త పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అదే సమయంలో రక్త పరీక్ష కేంద్రానికి ఇద్దరు కుమార్తెలతో ఓ తల్లి కూడా వచ్చారు. షుగర్ టెస్టుకు వచ్చిన అరుణ, అమె కూతురు నగదు ఉన్న సంచిని పక్కన పెట్టి రక్తపరీక్ష చేయించుకునే క్రమంలో ఆ బ్యాగును పట్టుకుని ఆ ముగ్గురు మహిళలు ఆటోలో పరారయ్యారు. రక్తపరీక్ష ఫీజు కట్టేందుకు తమ బ్యాగును పరిశీలించగా అక్కడ ఆ బ్యాగ్ కన్పించకపోవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై సీఐని వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

పారదర్శకంగా భూ సమస్యల పరిష్కారం

- 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు
- సమీక్షించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మే 31 (ఆంధ్రజ్యోతి): భూ భారతి కార్యక్రమంలో ప్రజల నుంచి అందే భూసమస్యల దరఖాస్తులను పారదర్శకంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన రెవెన్యూ సదస్సుల నిర్వహణపై తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నేలకొండపల్లి, బోనకల్ మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి గ్రామాలలో భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరించామని, భూ భారతి చట్టం ప్రకారం వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జూన్ 3 నుంచి జూన్ 20 వరకు జిల్లాలోని మిగిలిన మండలాల వారిగా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి తహసీల్దార్ అధ్యక్షతన బృందం, నాయబ్ తహసీల్దార్ అధ్యక్షతన మరో బృందం ఏర్పాటు చేసి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి మండలానికి రెండు బృందాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతిరోజు రెవెన్యూ సదస్సుల నిర్వహణ సంబంధించి నివేదికలను సమర్పించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి భూ సమస్య దరఖాస్తుకు సంబంధించి రసీదు అందించాలని సూచించారు.


సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

గ్రామంలో పూర్తి స్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని అవసరమైన మేర హెల్ప్ డెస్క్, దరఖాస్తులు స్వీకరించేందుకు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ఎస్ఆర్, పీవోటీ భూ సేకరణ కేసులు, సరిహద్దు వివాదాలు, పార్ట్ బీ కేసులు, అసైన్మెంట్ భూములకు సంబంధించిన వివాదాలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 1 నాటికి ప్రతి మండలంలో అవసరమైన మేర దరఖాస్తులను ప్రింట్ తీసి పెట్టాలని సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అన్నారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తును తిరస్కరించే పక్షంలో తప్పనిసరిగా కారణాలు దరఖాస్తుదారునికి తెలపాలన్నారు. భూ సమస్యల పరిష్కారం సంబంధించి అధికారులు పారదర్శకంగా చట్టం ప్రకారం, నిబంధనల మేరకు పనిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్డీసీ ఎం. రాజేశ్వరి, రెవెన్యూ డివిజన్ అధికారులు జి. నర్సింహారావు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్‌పై కార్పొరేటర్ ఫిర్యాదు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే31(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో సమస్యలపై అసిస్టెంట్ కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఏకంగా మహిళా కార్పొరేటర్ శనివారం ఫిర్యాదు చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్యకు రాతపూర్వకంగా ఈ ఫిర్యాదు అందజేశారు. డివిజన్‌లో పారిశుధ్య సమస్యలతో పాటుగా జవాన్ల విషయంపై మాట్లాడేందుకు కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫోన్ చేస్తే ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఫోన్ చేసి తన టైం వేస్ట్ చేయొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశారని, మహిళా కార్పొరేటర్ అని చూడకుండా దూషించారని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు కేఎంసీలో చర్చనీయాంశంగా మారింది.

ఉపేందర్‌రెడ్డి కుటుంబానికి పొంగులేటి పరామర్శ

తిరుమలాయపాలెం, మే31(ఆంధ్రజ్యోతి): మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాజారం గ్రామానికి చెందిన మద్ది ఉపేందర్‌రెడ్డి కుటుంబాన్ని శనివారం రెవెన్యూ, గృహనిర్మాణ,శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆయన గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుబ సభ్యులను ఓదార్చారు ఈ కార్యక్రమంలోజిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, ఆత్మకమిటీచైర్మన్ చావా శివరామకృష్ణ,గంగ్ర గోపాలరావు వనవాసం నరేందర్‌రెడ్డి, చామా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పొగాకు వ్యతిరేక దినోత్సవం



బాహుబలి సిగరెట్‌ను వెలిగిస్తున్న వాకర్లు

ఖమ్మంస్పోర్ట్స్, మే31(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. పొగాకు వల్ల ఆరోగ్యానికి కలిగే నష్టాలను తెలియ చేస్తూసుమారు8 అడుగుల బాహుబలి సిగిరెట్‌ను వెలిగించి వినూత్నంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్‌కమిటీ సభ్యులు శ్యాంబాబు, విజయ్, వెంకట్, శ్రీనివాసరెడ్డి, సుదర్శన్, వెంకటేశ్వర్లు మాధవి, రమా, భాగ్య, రాజ్యలక్ష్మి, సబిత తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద



ఇల్లెందు క్రాస్‌రోడ్డులో విద్యుత్ వెలుగులు

నగరం ముస్తాబు

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి సర్వాంగ సుందరం

ప్రధాన కూడళ్లు, కార్యాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరణ



ఎన్టీఆర్ సర్కిల్‌లో..



విద్యుద్దీపాల వెలుగుల్లో కేఎంసీ కార్యాలయం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఖమ్మంనగరం ముస్తాబైంది. ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఖమ్మం నగర పాలక సంస్థలోని రెండు బ్లాక్‌లకు విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఎన్టీఆర్ సర్కిల్, జెడ్పీసెంటర్, శ్రీశ్రీసర్కిల్, ఇల్లెందు క్రాస్‌రోడ్డు, జయశంకర్‌సర్కిల్, త్రీటౌన్‌సర్కిల్, కాల్వొడ్డు సర్కిల్, అంజనేయస్వామి విగ్రహం సర్కిల్, లకారం సర్కిల్, ముస్తాఫానగర్ సర్కిల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



కాల్వొడ్డు సర్కిల్‌లో..

ఏదులాపురం సొసైటీ చైర్మన్‌పై ఫిర్యాదు

ఖమ్మంరూరల్, మే31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం సొసైటీ చైర్మన్‌పై రూరల్ మండలం గుండాలతండా గ్రామానికి చెందిన తేజావత్ బాలు శనివారం డీసీవోకు ఫిర్యాదు చేశారు. సొసైటీలో తన పేరుమీద క్రాఫ్‌లోను తీసుకుని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆరోపించారు. రుణమాఫీ అవుతుందని కాలయాపన చేస్తున్నాడని తెలిపారు. న్యాయంచేయాలని అధికారులను కోరాడు.

కాపరి లేకుండా పశువులను వదలొద్దు

ఖమ్మంరూరల్, మే31(ఆంధ్రజ్యోతి): మనిషి లేకుండా పశువులను మేతకోసం బయటకు వదలవద్దని మండల పశువైద్యాధికారి అనంత్ హరీష్ శనివారం ఓ ప్రకటనలో రైతులకు సూచించారు. మనుషులు లేకుండా బయటకు వదలితే యాక్సిడెంట్లుకు గురికావాల్సి వస్తుందన్నారు. గాలి దుమారానికి విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే పశువులు విద్యుత్ షాక్‌కు గురవుతాయని తెలిపారు. ఎక్కువ మోతాదులో అన్నం, వడ్లు, బియ్యం, మొక్కజొన్న తిన్నచో ప్రమాదం ఉంటుందన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మే30 (ఆంధ్రజ్యోతి): అసంబద్ధమైన ఉపాధ్యాయుల సర్దుబాటు నియమాలు మార్చి బడిబాట కార్యక్రమం పూర్తయ్యాక ఉపాధ్యాయుల సర్ధుబాటు నిర్వహించాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు యలమద్ది. వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం డీఈవోకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌మృత్‌కుమార్, రాయల. నరసింహారావు, సతీష్ పాల్గొన్నారు.

25 జీవోను సవరించాలి

2025-26 విద్యాసంవత్సరానికి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 25ను విడుదల చేసిందని, అందులో అనేక అసంబద్దాలు ఉన్నాయని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంగళరావు అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో విజయ్, ఈ సమావేశంలో నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ఉమాదేవి, యాకూబ్‌పాషా పాల్గొన్నారు.

డీఏలను విడుదల చేయాలి

ఖమ్మంఖానాపురంహవేలి,మే31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న ఐదు డిఏలను, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా. రవి అన్నారు. శనివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, నాగేశ్వరరావు, నాయకులు వెంకన్న, షమి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృత్యువాత

నేలకొండపల్లి, మే31 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చెర్వుమాధారంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన నెలకుర్తి శేఖర్‌రెడ్డి గేదెలను మేతకు తోలుకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని మేస్తుండగా, ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న స్టేవైర్‌కు విద్యుత్ ప్రసారం అవుతుండటంతో, అటువైపు వెళ్లిన గేదె వైరుకు తగలటంతో మృతి చెందింది. గేదె విలువ సుమారుగా రూ.70వేల వరకు ఉంటుందని రైతు చెప్పాడు. ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నాడు.

ముగిసిన వేసవి బ్యాడ్మింటన్ శిబిరం

ఖమ్మం స్పోర్ట్స్, మే 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో నెల రోజులుగా జరిగిన వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు వేసవి శిబిరం ముగింపు రోజున శిక్షణలో పాల్గొన్న చిన్నారులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, కార్పొరేటర్ కమర్తపు మురళి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం, సెక్రెటరీ వింజనంపాటి చంద్రశేఖర్, ట్రెజరర్ జట్ల శ్రీను, సిరిపురపు సుదర్శన్, జగదీష్ పాల్గొన్నారు.

34 మంది మైనర్లకు జరిమానా

ఖమ్మంఖానాపురంహవేలి,మే31 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపిన 34మంది మైనర్లకు ఒక్కక్కరికి వేయి రూపాయాలు, మద్యం తాగి వాహనాలు నడిపిన 75 మందికి వేయి నుంచి రెండు వేల రూపాయల వరకు జరిమానా విధించారు. న్యాయస్థానం తీర్పు వెల్లడించిందని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల నగరంలో వాహనాలు తనిఖీలు నిర్వహించగా వాహనాలు నడుపుతూ పట్టుబడ్డిన మైనర్లపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరుచగా 4వ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్(స్పెషల్ మొబైల్) న్యాయమూర్తి బి.నాగమణి జరిమానా విధించారు. మొత్తం రూ.1,40,400 జరిమానా విధించినట్లు తెలిపారు.

రైతులు రశీదులు భద్రపర్చుకోవాలి

- విత్తన వ్యాపారులు చట్టానికి లోబడి వ్యాపారం చేయాలి
- కూసుమంచి ఎస్ఐ నాగరాజు



మాట్లాడుతున్న కూసుమంచి ఎస్ఐ

కూసుమంచి, మే31(ఆంధ్రజ్యోతి): రైతులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తీసుకోవాలని, వాటిని భద్రపరుచుకోవాలని ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు. శనివారం కూసుమంచి రైతు వేదికలో కూసుమంచి మండల వ్యవసాయాధికారి రామడుగు వాణితో కలిసి విత్తన వ్యాపారుల సమావేశంలో మాట్లాడారు. వాణి అధ్యక్షతన జరిగిన విత్తన వ్యాపారుల సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో అమ్మకూడదన్నారు. వ్యాపారులెవరైనా కల్తీ/నిషేధిత విత్తనాలను అమ్మితే తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు విత్తనాలను అమ్మిన సమయంలో రైతులకు తప్పనిసరిగా బిల్లులివ్వాలన్నారు. రైతులు కూడా వ్యాపారులను అడిగి బిల్లులు తీసుకోవాలన్నారు. బిల్లును పంట చేతికొచ్చే వరకు దాచి ఉంచాలన్నారు.గ్రామాల్లో ఎక్కడైనా ప్రభుత్వం నిషేధించిన బీటీ3 లేదా హెచ్‌టీ పత్తి విత్తనాలను అమ్ముతున్నట్లు గానీ, సరఫరా చేస్తున్నట్లు గానీ తెలిసినా, సమాచారం అందినా వెంటనే పోలీసులకు, వ్యవసాయాధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్‌కు వీడ్కోలు



దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయాధికారులు

ఖమ్మంలీగల్, మే31(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో 3వ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న దుర్గాప్రసాద్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా న్యాయ శాఖ ఉద్యోగులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎస్సీ ఎస్టీ కోర్టు న్యాయాధికారి దేవినేని రాంప్రసాద్, ప్రత్యేక మహిళా కోర్టు న్యాయాధికారి వి.శ్రీనయ్య హాజరయ్యారు. న్యాయశాఖలో ఉద్యోగిగా ఆయన సేవలను కొనియాడారు. జీవితం ఆయురారోగ్యాలో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దుర్గాప్రసాద్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పదేళ్లుగా ఇళ్లు ఇవ్వని గత ప్రభుత్వం

- మాజీ ఎంపీపీ గోపాలరావు



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ

కూసుమంచి,మే31(ఆంధ్రజ్యోతి):బీఆర్ఎస్ రాష్ట్రాన్ని పాలించిన పది సంవత్సరాల్లో పేదలకు ఇళ్లు ఇవ్వలేదని కూసుమంచి మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు విమర్శించారు. శనివారం పెరికసింగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గోపాలరావు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ప్రజాపాలన సాగుతున్నదన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్నారు. ప్రతి పేదవానికి రేవంత్ సర్కార్‌లో ఖచ్చితంగా ఇందిరమ్మ ఇల్లు వస్తుందని గోపాలరావు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తిప్పని సరోజిని, నాయకులు ఇంద్రసేనారెడ్డి, షేక్.హుస్సేన్, చాట్ల పరుశురామ్, ఏడుకొండలు, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

మూటాపురంలో శంకుస్థాపన

నేలకొండపల్లి: మండల పరిధిలోని మూటాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు శనివారం శంకుస్థాపన చేశారు. సీడీసీ డైరెక్టర్ గుడిమళ్ల మధు మాట్లాడుతూ మూటాపురం గ్రామానికి 30ఇళ్లు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఇల్లులేని పేదలకు ఈ పథకం వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈఈ, కార్యదర్శి స్వరూపారెడ్డి, సొసైటీ డైరెక్టర్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు బొల్లినేని వెంకటేశ్వర్లు, కట్టా రాజేష్, నంబూరి ప్రసాద్, ఏలూరి హనుమంతరావు, చావా పెద్దపుల్లయ్య, శ్యామలేటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మధు

బాధ్యతలు చేపట్టిన సహకార సంఘం కార్యదర్శి

తిరుమలాయపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం సహకార సంఘం కార్యదర్శిగా ఏలూరి ఆనందరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి బదిలీపై వేంసూరు మండలం మర్లపాడు వెళ్లారు ఈ సందర్భంగా ఆనందరావుకు కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు. ఆయన్ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చావా వేణు,ఏవో సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్త మృతి



జాలయ్య

నేలకొండపల్ల, మే31(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ఈగా జాలయ్య(70) శనివారం తెల్లవారుఝామున గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించిన సమయంలో నేలకొండపల్లిలో తొలిసారిగా టీడీపీ జెండాను పాతిన వ్యక్తి జాలయ్య... మెదటి నుంచి టీడీపీలో క్రియాశీలకంగా పని చేసి, మధ్యలో కొంతకాలం బీఆర్ఎస్‌లోకి వెళ్లాడు. తిరిగి తెలుగుదేశంలో చేరాడు. జాలయ్య మృతి సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం నాయకులు మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ సూరపనేని రామకృష్ణ, టీడీపీ పట్టణ కార్యదర్శి వీసం శ్రీనివాసరావు, గువ్వలగూడెం గ్రామశాఖ అధ్యక్షుడు కోలేటి మస్తాన్‌రావు, గోగినేని సీతారామారావు, నూక హనుమంతరావు, గుండు శ్రీనివాసరావు, తాడేపల్లి వెంకటేశ్వర్లు, వంగవేటి రవీందర్, యెండూరి బ్రహ్మం తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీలేదు

మేయర్ పునుకొల్లు నీరజ



ఖమ్మంసంక్షేమవిభాగం, మే31(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని మేయర్ పునుకొల్లు నీరజ సూచించారు. శనివారం 26వ డివిజన్‌లో సుగ్గాలవారి తోట సమీపంలో ఇటీవల నిర్మాణం చేసిన సీసీ రహదారి పనులను మేయర్ పునుకొల్లు నీరజ తనిఖీలు చేశారు.

రిటైర్డ్ పోలీస్ అధికారులకు సన్మానం

ఖమ్మంఖానాపురం హవేలి, మే 31 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ పొందిన పోలీస్, హోంగార్డు అధికారులకు పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ సన్మానించారు. శనివారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సీపీ మాట్లాడారు. సుదీర్ఘకాలం పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. కుటుంబ సభ్యులను అభినందించారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవం



రాయగూడెంలో బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

నేలకొండపల్లి, మే31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయగూడెం గ్రామంలో శనివారం నాభిశిల(బొడ్రాయి)ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం ఉదయం 6గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 8.12గంటలకు వేద పండితులు బలగం భార్గవశర్మ అవధాని ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈవేడుకలు హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తీగ వెంకటేశ్వర్లు, బోయిన వేణు, తీగ రమణయ్య, యెన్నబోయిన శ్రీను, కొత్తగూడెం డీఎస్పీ షేక్. రహమాన్, నంబూరి సత్యనారాయణ, డేగల రోషయ్య, షేక్.హుస్సేన్, బోయిన బలరాం, నంబూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏదులాపురాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

కమిషనర్ శ్రీనివాసరెడ్డి





మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరెడ్డి, హాజరైన అధికారులు

ఖమ్మంరూరల్, మే31(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం ఓ ఫంక్షన్‌హాల్లో జూన్2 నుంచి పురపాలకంలో చేపట్టాల్సిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య పనులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రణాళిక ముగింపునాటికి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పారిశుధ్య కార్మికులదే అన్నారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. మెప్మా, ఎస్బీవెఓస్‌ల సహకారం తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. తాగునీటి ట్యాంకుల వద్ద పరిశుభ్రత పాటించాలని 10రోజులకు ఒకసారి శుభ్రం చేయాలన్నారు. పురపాలకంలో ఖాళీస్థలాలు పెద్ద సమస్యగా మారాయన్నారు. వీరికి మొదట నోటీసులు ఇవ్వనున్నామని స్పందించకుంటే ప్రభుత్వ పరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించి త్వరలో గెజిట్ వస్తుందన్నారు. వ్యాపాస్తులు తప్పకుండా లైసెన్స్‌లు తీసుకోవాలన్నారు. ప్రమాదకరంగా ఉన్న పాతభవనాలకు సంబంధించి సమాచారం వాట్సప్ ట్విట్టర్‌లో పొందుపరచాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు తీసుకోవాలన్నారు. పురపాలకంలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక అధికారులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్, కిరణ్, మధు, ఉమారాణి,తదితరులు పాల్గొన్నారు.

బుద్ధి మారని కేఎంసీ జవాన్లు

- నేతల సిఫారసులతో నాడు కార్యకర్తలకు ఉద్యోగం
- రాజకీయ కోణంలో నేడు చిల్లర వేషాలు

ఖమ్మంసంక్షేమ విభాగం, మే31(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల వద్ద సూపర్‌వైజర్లుగా పని చేసిన వ్యక్తులు కొందరు తర్వాత కాలంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏకంగా పారిశుధ్య జవాన్లుగా ఉద్యోగాలు పొందారు. ఇప్పుడు ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం రావటంతో పాటుగా బీఆర్ఎస్ నుంచి కొంతమంది కార్పొరేటర్లు సైతం కాంగ్రెస్‌లో చేరారు. కాగా రాజకీయ పలుకుబడితో పారిశుధ్య జవాన్లుగా ఉద్యోగంలో చేరిన వారు బుద్ధిగా ఉద్యోగాలు చేసుకోవటం లేదు. కాంగ్రెస్ కార్పొరేటర్లు డివిజన్‌లపై నిరాధారమైన ఫిర్యాదులు చేయటం, పారిశుధ్య నిర్వాహణపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు. దీంతో కాంగ్రెస్ కార్పొరేటర్లు ఆయా జవాన్లపై కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేయించి డివిజన్లు మార్పించారు. దీంతో వారి అనుచరులు, ప్రస్తుత జవాన్లకు మరి కొంతమంది కార్పొరేటర్లు సపోర్టుగా నిలుస్తున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే వంద రోజులు కార్యాచరణతో రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ముందస్తు కార్యచరణతో వెళ్తుంటే, రాజకీయ పలుకుబడితో ఉద్యోగాలు పొందిన జవాన్లు సీజన్ సమయంలోనే కేఎంసీ అధికారులకు తల నొప్పిగా మారారు.


ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
ఆదివారం 1 జూన్ 2025
వైరా-మధిర
8
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

3వతేదీ నుంచి భూ భారతి సదస్సులు

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈనెల 3నుంచి 18వతేదీ వరకు భూ భారతి సదస్సులు నిర్వహిస్తామని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వీటి కోసం అధికారుల బృందాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. తన నేతృత్వంలో ఒక బృందం, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు నేతృత్వంలో మరో బృందం గ్రామాల్లో భూభారతి సదస్సులు నిర్వహిస్తాయని తెలిపారు. గిర్దావర్‌లు రాజవిక్రమ్, శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది ఈ రెండు బృందాల్లో సభ్యులుగా ఉంటారని వివరించారు. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వంతెన శిథిలం.. రోజుకో ప్రమాదం..

- శిథిలావస్థకు చేరిన వైరా బ్రిడ్జ్
- వంతెన నిర్మాణంపై లేని పట్టింపు


ధ్వంసమైన రెయిలింగ్ స్థానంలో బారికేడ్లు


ఇరుకు వంతెనపై వాహనాల రాకపోకలు

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ ప్రధాన రహదారిలో వైరా నదిపై ఉన్న హైలెవల్ వంతెన మృత్యుకుహరంగా మారింది. మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ ఇరుకు వంతెనపై ప్రతి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఇరుకు వంతెన స్థానంలో వెడల్పు పెంచి కొత్త వంతెన నిర్మించే విషయంలో పాలకులు గానీ, అధికారులు గానీ కనీసం దృష్టిసారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి నిత్యం జిల్లాకు చెందిన అమాత్యులు ఈ ఇరుకు వంతెనపైనుంచి ప్రయాణాలు చేస్తున్నారే తప్ప కొత్త వంతెన గురించి ఆలోచించటం లేదనే వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. ఈ హైలెవల్ వంతెనపై ప్రయాణాలు ప్రాణాంతకంగా మారాయి. శుక్రవారం ఈ హైలెవల్ వంతెన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక లారీ డ్రైవర్ షేక్.మహబూబ్ సుభానీ అలియాస్ మున్నా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒక కుటుంబానికి చెందిన ఐదుగురు ఈ ఘోర ప్రమాదం నుంచి గాయాలతో పునర్జన్మపొందారు. ఒక డీసీఎం వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఇలాంటి ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి.

1991-92లో వంతెన నిర్మాణం...

వైరా-స్టేజీ పినపాక గ్రామాల మధ్య ఉన్న వైరా నదిపై 1991-1992 ప్రాంతంలో కేవలం రూ.80లక్షలతో ఈ ఇరుకు హైలెవల్ వంతెన నిర్మాణాన్ని ప్రారంభించారు. నాటి మధిర ఎమ్మెల్యే, సీపీఎం శాసనసభ పక్ష నాయకుడైన బోడేపూడి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి మేరకు నాటి సీఎం నేదురుపల్లి జనార్ధన్‌రెడ్డి నిధులు మంజూరు చేయడమేకాకుండా ఆయనే స్వయంగా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు సంవత్సరాల్లో ఈ వంతెన నిర్మాణాన్ని పూర్తిచేశారు. ఈ వంతెన నిర్మాణ సమయంలో ప్రస్తుత జాతీయ రహదారి రాష్ట్రీయ రహదారిగా ఉండేది. ఆ సమయంలో ప్రతిరోజూ నాలుగైదువేల వాహనాలు మాత్రమే ఈ రోడ్డుపై రాకపోకలు కొనసాగించేవి. ఆవాహనాల రద్దీకనుగుణంగా నాటి ఆర్థిక పరిస్థితుల మేరకు లోలెవల్ కాజ్‌వే స్థానంలో ఈ హైలెవల్ వంతెనను నిర్మించారు. వైరా రిజర్వాయర్ పొంగి ప్రవహించిన సమయంలో నదిపైనున్న లోలెవల్ కాజ్‌వేపైనుంచి ఐదారుఅడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహించేది. ఆసమయంలో రోజులతరబడి ఈ రోడ్డుపైన రాకపోకలు నిల్చిపోయేవి.

పెరిగిన వాహనాల రాకపోకలు...

గత మూడున్నర దశాబ్దాల కాలంలో ఈ రహదారిపై వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఇప్పుడు ప్రతి నిత్యం 40నుంచి 50వేలకు పైగా వాహనాలు జాతీయ ప్రధాన రహదారిలోని ఈ ఇరుకు వంతెన గుండా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వెళ్లే సమయంలో కనీసం నడిచి వెళ్లటానికి కూడా అవకాశం లేని ఇరుకుగా ఈ వంతెన ఉంది. ప్రతిరోజూ ఈ వంతెనపై ఎదురెదురుగా వాహనాలు ఢీకొనడం, గంటలతరబడి ట్రాఫిక్ స్తంభించటం పరిపాటిగా మారింది. ఈ వంతెనకు ఒకవైపున అప్రోచ్ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. వైరా నుంచి తల్లాడ వైపు వెళ్లే సమయంలో అప్రోచ్ రోడ్డు నుంచి వంతెన ముందు ప్రమాదకరమైన మూలమలుపు ఉంది. ఇక్కడే నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా వంతెన ముందున్న మూలమలుపులోనే ఈ ఘోర ప్రమాదం జరిగింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ తదితర రాష్ట్రాలకు అనుసంధానంగా ఈ జాతీయ రహదారి ఉంది. ఈ రహదారిలోని ఇరుకు వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెన నిర్మాణ సమయంలో బీమ్‌లకు స్టీల్ ఎక్కువగా వాడటంతో సిమెంట్ కాంక్రీట్ బీమ్‌ల అడుగుభాగంలోకి దిగకపోవడంతో 1998 ప్రాంతంలో ఈ వంతెన కొన్నిచోట్ల ఒంగిపోయింది. అయితే అధునాతన ఇంజనీరింగ్ పద్ధతుల్లో ఈ వంతెనకు మరమ్మతులు చేశారు. అలాంటి ఈ వంతెనే ఇప్పుడు ప్రతి రోజూ 40నుంచి 50వేల వాహనాల రాకపోకలకు దిక్కుగా ఉంది. ఈ వాహనాల రద్దీకనుగుణంగా మరో వంతెనను నిర్మించాల్సి ఉంది.

మంత్రుల నిత్య పర్యటనలు...

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ ఇరుకు వంతెనకు కూత వేటు దూరంలో ఉన్న స్నానాల లక్ష్మీపురం గ్రామానికి చెందినవారు. ఈ ఇరుకు వంతెన నుంచి స్నానాల లక్ష్మీపురం కేవలం రెండుకిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఆయన తరచూ ఈ వంతెన పైనుంచే రాకపోకలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో అత్యంత సీనియర్ మంత్రి అయిన తుమ్మల నాగేశ్వరరావు గత 30సంవత్సరాల నుంచి ఈ వంతెన పైనుంచే నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఆయన స్వగ్రామమైన దమ్మపేట మండలంలోని గండుగలపల్లికి ఈ రహదారిలోని ఈ ఇరుకు వంతెన పైనుంచే వెళ్లి వస్తున్నారు. 2002లో జరిగిన ఈ రోడ్డు వెడల్పు సమయంలో ఇరుకు వంతెన ముందు ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్డును రైతుల పొలాల నుంచి వంకర లేకుండా నిర్మించేందుకు ప్రయత్నించారు. ఆసమయంలో తుమ్మల ఆర్అండ్‌బీశాఖ మంత్రిగా ఉన్నారు. వంకర లేకుండా రైతుల పొలాల నుంచి నిర్మించతలపెట్టిన రోడ్డు నిర్మాణం కారణాలు ఏమైనప్పటికీ ముందుకు సాగలేదు. ఇకపోతే మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా ఇదే వంతెనపైనుంచి నిత్యం రాకపోకలు కొనసాగిస్తున్నారు. మండలంలోని తమ స్వగ్రామమైన నారాయణపురం గ్రామానికి అలాగే జిల్లాలో నిత్యం ఆయన రాకపోకలు కొనసాగిస్తున్నారు. అమాత్యులున్నప్పటికీ ఇరుకు వంతెనపై దృష్టి సారించడం లేదనే వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి.

మహిళల ఆర్థికాభివృద్ధికి పాడిపరిశ్రమ తోడ్పాటు


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సన్యాసయ్య

మధిరరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమతో మధిర నియోజకవర్గంలోని ఇందిరా డెయిరీ మహిళ సభ్యులు ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య అన్నారు. శనివారం మధిరలోని ఇందిరాడెయిరీ డివిజన్ కార్యాలయంలో జరిగిన స్వయంసంఘాల మహిళల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరా డెయిరీ ప్రాముఖ్యతను, కలిగే ప్రయోజనాలను మహిళ సంఘాల సభ్యులకు వివరించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ముందుచూపుతో ఆలోచించి 2013 లోనే ఈ డైరీ ప్రారంభించారన్నారు. సబ్సిడీపై ఒక్కో మహిళకు రెండు పాడిగేదెలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం లు లక్ష్మణరావు, శ్రీనివాసరావు, డివిజన్‌లోని నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలు, స్వయంసంఘాల మహిళలు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ ఆలయ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న తుళ్లూరు దంపతులు

ఎర్రుపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో సేవాలాల్ తండాలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్, మారెమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠను శనివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరానికి చెందిన కేఎస్‌ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మలకుమారి ఈ ఆలయాన్ని నిర్మించారు. ఎంకాన్ అధినేత మూల్పూరి శ్రీనివాసరావు విగ్రహాలను అందించారు. మహారాష్ట్ర సేవాఘడ్ పీఠాధిపతి వాల్యానందస్వామి ఆధ్వర్యంలో బంజార సాంప్రదాయంలో, వైదిక ఆగమశాస్త్ర ప్రకారం సేవాలాల్, మారెమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. పీఠాధిపతి మాట్లాడుతూ.. అందరిలో సమానత్వాన్ని చాటి ఆధ్యాత్మిక శిఖరాలను అందుకుని అందరికి ఆదర్శంగా నిలిచారన్నారు. మారెమ్మ తల్లి , సేవాలాల్ ఆలయ నిర్మాణం వల్ల బంజారాలకు ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుందన్నారు. ఆలయ నిర్మాణానికి కృషిచేసి దాతలు, గ్రామస్తులను బంజారాలు సత్కరించారు. తండా నాయకుడు భూక్యా బాలాజీ, తండాపెద్దలు నునావత్ లక్ష్మణుడు, గుగులోత్ బాలు, భూక్యా వెంకన్న, బానావత్ బలరాం, బానావత్ శ్రీను, వెంకటేష్, గోపి, కుమారస్వామి తదితరుల పాల్గొన్నారు.

మొ'బైల్' బారికేడ్లు..!

- పశువులకు అడ్డాగా మారిన రహదారులు
- పట్టించుకోని అధికారులు..


కల్లూరు నేషనల్ హైవేపై సేదతీరుతున్న పశువులు

కల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రద్దీతో పాటుగా జనసంచారం గల నేషనల్ హైవేతోపాటుగా అంతర్గత రహదారులపై పశువులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. పశువుల యాజమానులు తమ పశువులను అడ్డగోలుగా వదిలేయడంతో రాత్రి పూట ద్విచక్ర వాహనాదారులకు ప్రమాదకరంగా మారాయి. నల్ల పశువులు రాత్రిపూట సమయంలో సంచరించటంతో ఇటీవల పలు గ్రామాల్లో ద్విచక్రవాహనాదారులు ప్రమాదాల బారిన పడ్డారు. ఇలా పశువులు యేదేచ్ఛగా తిరుగుతున్న వాటిని నియంత్రించడంలో అధికారులు ఏమాత్రం స్పందించిన పరిస్థితి. పశువుల సంచారంతో రహదారులపై ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతుంది. ఇంకాను మండల పరిధిలో గల పలు గ్రామాలకు అనుసంధానం గల బీటీ రహదారులపై కూడ నల్ల పశువులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఇటీవల ఒక విద్యార్థి ద్విచక్ర వాహనంపై రాత్రి పూట కల్లూరు నుంచి పెద్దకోరుకొండికి వస్తుండగా ప్రమాద బారిన పడ్డాడు. కల్లూరు నేషనల్ హైవేపై హిమాలయ రెస్టారెంట్ నుంచి ఎన్ఎస్పీ క్రాస్ రోడ్ వరకు ఇదే విధంగా పశువులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి రహదారులపై విచ్చల విడిగా సంచరిస్తున్న పశువులను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ముగిసిన కంటి వైద్యశిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ముదిగొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో శనివారం భక్తరామదాసు సర్వీస్ సొసైటీ లయన్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 200మందికి కంటి పరీక్షలు నిర్వహించిగా 30మందికి కంటి శస్త్రచికిత్సలు చేయాలని నిర్ణయించారు. భక్తరామదాసు సర్వీస్ సొసైటీ చైర్మన్ వెంకటరామారావు, కార్యదర్శి వెంకటరమణగుప్తా, రవీంద్రబాబు, లింగస్వామి, జగన్మోహన్‌రావు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, డాక్టర్ రవిచంద్ర పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

తల్లాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నరసింహారావుపేట గ్రామంలో శనివారం రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి నరసింహారావు, అన్నారుగూడెం, గోపాలపెట తదిత గ్రామాలనుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

ఏన్కూరులో తిరంగా ర్యాలీ

ఏన్కూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): పెహల్గాం ఉగ్రదాడికి ధీటుగా భారత త్రివిధ దళాల సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట సాధించిన విజయయానికి ప్రతీకగా శనివారం ఏన్కూరులో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేసన్ నుంచి బయలుదేరి ఈ ర్యాలీ సాయిబాబా దేవాలయం, వరకుసాగింది. జయహో భారత్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో ఆపరేషన్ సింధూర్ గురించి పలువురు వివరించారు. ఆరెం రామయ్య, కోపెల రామారావు, బొల్లి వెంకటేశ్వర్లు, నల్లబోతుల రమేష్, తదితరులు పాల్గొనాన్రు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పెనుబల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా మాస్టర్ రామకృష్ణ తెలిపారు. పెనుబల్లి ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా సంబరాల్లో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు, సిబ్బందికి ప్రాణాయామం విశిష్ఠ, యోగ గొప్పతనాన్ని గురించి ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ప్రాణాయామం చేయటం వల్ల మనిషి రోగనిరోధక శక్తి పెంచుకోవచ్చునని, సర్వరోగాలను నియంత్రించుకోవచ్చునని, వత్తిడిని జయించి మానసిక ప్రశాంతత పొందవచ్చునని ఆయన వివరించారు. ఇన్‌స్ట్రక్టర్ శిరీష, ఆయూష్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాస్‌నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది, ఫార్మాసిస్టులు అఖిల, నారాయణమ్మ, చాంద్‌బాషా పాల్గొన్నారు.

వాటర్ గ్రిడ్‌కు నిరంతర విద్యుత్

కల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోకవరం గ్రామంలో వాటర్ గ్రిడ్ వద్ద 33/11కెవి విద్యుత్ ఉపకేంద్రాన్ని శనివారం సత్తుపల్లి డివిజనల్ ఇంజనీర్ శ్రీరాములు సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపకేంద్రంలో నిరంతరాయంగా మంచినీటి సరఫరా జరిగేలా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఆధునీకికరణ చేసినట్లు చెప్పారు. అదే విధంగా సిబ్బందికి ఆయన తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు విద్యుత్ ఉపకేంద్రం ఏఈ వెంకట్ తదితరులు పాల్గొన్నారు

కరాటే శిక్షకుడికి ఘన సత్కారం


కరాటే క్రీడాకారులతో సీఐ కిరణ్

సత్తుపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): కరాటే జాతీయ రిఫరీ వి.పిచ్చయ్య ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా కరాటేలో ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని సత్తుపల్లి పట్టణ సీఐ కిరణ్ అన్నారు. గత నెల రోజులుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిచ్చయ్య నిర్వహిస్తున్న వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరం శనివారం ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కాకుండా ఇలాంటి శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పిచ్చయ్యను ఘనంగా సన్మానించారు. కరాటే ఉచిత శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు కూడా అందజేస్తున్నట్లు పిచ్చయ్య తెలిపారు.

ఘనంగా తాతా మధు జన్మదిన వేడుకలు

మధిరరూరల్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ జన్మదిన వేడుకలను శనివారం మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ మొండితోక లతజయకర్, నాయకులు రావూరి శ్రీనివాసరావు, బిక్కి కృష్ణప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, కనుమూరి వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, కొఠారి రాఘవరావు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): వైరాలో ప్రముఖ వైద్యురాలు కాపా చంద్రకళ జన్మదినాన్ని పురస్కరించుకొని పేద మహిళలకు రెండు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్‌కు చెందిన వారు ఇద్దరు పేద మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. నాయీబ్రాహ్మణ సంఘానికి చెందిన శ్రీకాకుళం శ్రీనివాస్‌కు రూ.ఐదువేల ఆర్థికసహాయాన్ని డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతులమీదుగా అందజేశారు. కేక్ కట్‌చేసి డాక్టర్ చంద్రకళ జన్మదిన వేడుకలు నిర్వహించారు. 19సంవత్సరాలుగా వైరాలో ఆమె చేస్తున్న సేవలను అభినందించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

హార్మోనియా కళాకారుడి మృతి

వైరా, మే 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొష్టాల గ్రామంలో ప్రముఖ హార్మోనియా కళాకారుడు బొక్కా జయరాజు(82)శనివారం మృతిచెందారు. వందలాది పౌరాణిక నాటకాలకు జయరాజు హార్మోనిస్టు కళాకారుడిగా పనిచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలోని అనేక ప్రాంతాల్లో హార్మోనిస్టు కళాకారుడిగా జయరాజు సుపరిచితుడు. బీఆర్ అంబేద్కర్ ప్రజాసంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, ప్రముఖ న్యాయవాది పాముల దానయ్య, ఉపాధ్యాయుడు గుంటి మోహన్‌రావు, రిటైర్డ్ హెచ్‌ఎం కొత్తా శ్రీనివాసరావు, వేముల మోహన్‌రావు తదితరులు జయరాజు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దురలవాట్ల నిర్మూలనపై డీవైఎఫ్‌ఐ సైకిల్‌యాత్ర

కల్లూరు, మే 31 (ఆంధ్రజ్యోతి) చెడు వ్యాసనాలు వద్దు పోరాటాల ముద్దు అనే నినాదంతో కల్లూరు మండల పరిధిలో గల పలు గ్రామాల్లో శనివారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యస్‌కె.బషీరుద్దీన్ మాట్లాడుతూ.. నేటి కాలంలో యువత చెడు వ్యసనాల బారిన పడి తమ అమూల్యమైన భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెడు వ్యసనాల నుంచి దూరం ఉంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత దేశానికి బంగారు భవిష్యత్తు లాంటి వారిని అన్నారు. గంజాయి, మద్యపానాలకు గురై తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని చెప్పారు. మండల పరిధిలోని చిన్నకోరుకొండి, పోచారం, పెద్దకోరుకొండి గ్రామాలలో ఈ చైతన్య యాత్ర సాగింది. ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్, శీలం వీరబాబు, యాత్ర మేనేజర్ సత్తెనపల్లి నరేష్, గుమ్మ ముత్తారావు, ప్రజా సంఘాల నాయకులు ముదిగొండ అంజయ్యచంద్రరావు, లు పాల్గొనగా, సంఘీభావం తెలిపిన వారిలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సత్యనారాయణరెడ్డి, తన్నీరు కృష్ణార్జునరావు సీఐటీయు నాయకులు సర్వేశ్వరరావులు ఉన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలసిన సత్తుపల్లి ఎమ్మెల్యే


పీసీసీ అధ్యక్షుడిని కలసిన రాగమయి, దయానంద్

సత్తుపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్‌లు శనివారం పాల్వంచలో కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గంలో పార్టీ పరంగా జరుగుతున్న కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సత్తుపల్లి పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు పాల్గొన్నారు.

పొగాకు వాడకం ప్రాణాంతకం


పొగాకు నివారణపై అవగాహన కలిపిస్తున్న సిబ్బంది

తల్లాడ, మే 31 (ఆంధ్రజ్యోతి): పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని తల్లాడ మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ అన్నారు ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పొగాకు ఉత్పత్తుల నివారణపై అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ రత్నమనోహర్ మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తుల వాడుతున్న వారితో పాటు వారి కుటుంబసభ్యుల ఆరోగ్యానికి హానికరమన్నారు. పొగకు తాగడం వల్లతాగిన వారికి శ్వాసకోశ సంబంధ అవయవాలు పాడైపోతాయని, పొగాకు ఉత్పత్తులు నమలడం వల్లనోటి, గొంతు, శ్వాసకోశ, జీర్ణకోశ సంబంధ క్యాన్సర్ సంభవించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు ధూమపానానికి, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని కోరారు. ఎస్ఐ వెంకటకృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్లు భాస్కర్,పెద్దపుల్లయ్య, కమల, భద్రమ్మ, ఝాన్సీలక్ష్మి, కళావతి, రాజేశ్వరి , సురేస్, సంజయ్‌కృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు.

ముదిగొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ముదిగొండ పీహెచ్‌సీలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు ఆరోగ్యాన్నే కాదు జీవితాన్ని కూడా కాల్చేస్తుందని, పొగాకుకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం వైద్యసిబ్బంది రోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదన్‌రావు, పీహెచ్ఎన్ రాణి, సూపర్‌వైజర్లు లత, పద్మావతి, ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డిబోయిన రామారావు, పార్మాసిస్టు సత్యవతి, ఏఎన్ఎం కృష్ణమణి, అరుణకుమారి, రత్నకుమారి, పద్మావతి, వసంత, హేమలత పాల్గొన్నారు.

వానాకాలం సాగు పనులు షురూ


కంద్రికగ్రామంలో దుక్కి దున్నుతున్న రైతు

ఎర్రుపాలెం, మే 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు రాకతో రైతుల్లో తొలకరి కోలాహలం మొదలయింది. గడచిన మూడురోజులుగా కురుస్తున్న తొలకరి వానలతో వానాకాల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. కొన్ని రోజులుగా ఏకదాటిగా కురుస్తున్న వర్షాలకు సాధారణ ఉష్ణోగ్రతల కంటే 7నుంచి 9డిగ్రీలు తక్కువగానమోదవుతున్నాయని వాతావరణ కేంద్రం అంచనవేసింది. ఈ నేపథ్యంలో ఖరీఫ్ లోసాగు చేసేందుకు రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అధికారికంగా జూన్ మొదటి వారం నుంచి ఖరీఫ్‌సాగు మొదలుకానున్న నేపథ్యంలో పదును ఉన్న భూములకు రైతులు లోదుక్కులు చేసుకోవాలని ఇప్పటికే వ్యవసాధికారులు సూచించారు. దీంతోపాటు తొలకరి పలకరింపుతో ఖరీఫ్ సాగు సిద్ధంకాబోతుంది. గతీ వారమే జిల్లా వ్యవసాయశాఖ విత్తన క్రయవిక్రయాలకు అనుమతి ఇవ్వడంతో కొందరు రైతులు తమ భూములలో దుక్కులు చేసి విత్తనాలు విత్తేందుకు సిద్ధమవుతున్నారు. గతేడాది వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా ఈ ఏడాది ఆశాజనకంగా ఉండొచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఈఏడాది నాణ్యమైన పత్తి విత్తనాల ధర కేజీకి రూ.100పైగా పెరిగింది. గతేడాది మద్దతు ధర రూ.7100 ఉండగా ప్రసుత్తం అది రూ.7700కు చేరింది. లాభసాటి వ్యవసాయానికి శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

చింతకాని, మే 30 (ఆంధ్రజ్యోతి): గతేడాది మొక్కజొన్న పంట రైతులకు కలసిరావడంతో ఈ ఏడాది రెట్టింపు ఉత్సాహంతో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమయ్యారు. అనుకున్నదానికంటే ముందుగానే రుతుపవన వర్షాలు కురవడంతో ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్న రైతులు పత్తి సాగుకు శ్రీకారం చుట్టారు. శుక్రవారం మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో కొందరు రైతులు పత్తి విత్తనాలు నాటారు.

గెస్ట్ అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు(బాలుర), వైరా, బూర్గంపాడు (బాలికల) తెలంగాణ రాష్ట్రజనరల్ గురుకుల విద్యాలయాల్లో గెస్ట్‌అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల పాఠశాల కన్వీనర్ తుడి శ్రీనివాసరెడ్డి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. పాఠశాల, కళాశాలలో బోధించేందుకు అర్హత కలిగిన టీజీటీ, పీజీటీ పోస్టులకు జూన్ 3వతేదీలోపు దరఖాస్తు చేయాలన్నారు. అనుభవం, డెమో ఆదారంగా ఎంపిక జరుగుతుందని, ఎంపికైన అధ్యాపకులు ఇంగ్లీష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

దుమ్ముగూడెం నీటిని పాలేరులో కలపాలి


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

ముదిగొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం నీటిని పాలేరు రిజర్వాయర్‌లో కలపడం వల్ల ఖమ్మం జిల్లాలో లక్షలాది ఎకరాలు సాగులోకి వస్తాయని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పేర్కొన్నారు. శనివారం ముదిగొండలో రైతుసంఘం మూడో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ముగ్గురు మంత్రులు కలిసి దుమ్ముగూడెం నీటిని ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా నీటిని భద్రాద్రి కొత్తగూడెం నుంచి ఆంధ్రాకు తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. భూభారతి ద్వారా రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు రైతుభరోసా నిధులు మంజూరు చేయలేదన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రైతుసంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కందుల భాస్కర్‌రావు, కోలేటి ఉపేందర్‌తోపాటు 17మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్, సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, టీఎస్.కల్యాణ్ పాల్గొన్నారు.